


మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

ఖమ్మం మార్కెట్, సెప్టెంబరు 13: నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి 17 వరకు వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నట్టు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈనెల 14, 15 శని ఆదివారాలు వారాంతపు సెలవుల కారణంగా, 16న వినాయక నిమజ్జనం, 17న మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సెలవులు ఉన్నట్లు తెలిపారు. మార్కెట్‌లో తిరిగి ఈనెల 18 బుధవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని, రైతులు సెలవులు విషయాన్ని గ్రహించాలని కోరారు.





కళ్లు చెదిరే సెట్టింగ్‌లు... జిగేల్‌మంటున్న నవరాత్రులు

ఖమ్మం నగరంలో వినాయక పందిళ్లవద్ద ఏర్పాటు చేసిన సెట్టింగులు, వినాయక ప్రతిమలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి.. సినిమా సెట్టింగులను తలిపించే విధంగా వినాయక పందిళ్లను నెలకొల్పారు. తిరుపతి, కాణిపాకం, తదితర పుణ్యక్షేత్రాల నమూనాలను సైతం ఏర్పాటు చేయటంతో భక్తులు తిలకిస్తున్నారు.. ఈనెల 7వ తేదీ నుంచి నగరంలో గణ నాథులు భక్తులవిశేష పూజలందుకుంటున్నారు.. నగరంలో దాదాపు 1200 విగ్రహాలను ఏర్పాటు చేయటం విశేషం. వీధులు, కూడళ్ల తోపాటు కాలనీలు, అపార్టుమెంట్ల వద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలు ఆరు అడుగుల నుంచి 30 అడుగుల ఎత్తు వరకు ప్రతిష్ఠించారు. బ్రాహ్మణ బజార్, గాంధీ చౌక్, కస్బాబజార్, కమాన్ బజార్, బార్హాన్ పురం, మామిళ్ల గూడెం, పాత బస్టాండ్ ప్రాంతాల్లో భారీ విగ్రహాలను ఏర్పాటు చేశారు.

-ఖమ్మం సాంస్కృతికం

కరెన్సీ గణపయ్య

భద్రాద్రి జిల్లా పాల్వంచ పట్టణంలోని రాంనగర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుడు శుక్రవారం కరెన్సీ గణపతిగా దర్శనమిచ్చారు. రూ.కోటి 10 లక్షల కరెన్సీతో గణపతిని అలంకరించడం విశేషం. తూర్పుకాపు సంఘం ఆధ్వర్యంలో ఇక్కడ గణపతి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. 7వ రోజు శుక్రవారం మండపాన్ని, స్వామి వారిని కరెన్సీ మాలలతో అలంకరించారు. దీంతో స్వామివారు లక్ష్మీగణపతిగా దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొంచాడ మల్లేష్ నాయుడు, ఎన్‌పి నాయుడు, ముగిది శ్రీనివాస్, కొంచాడ కృష్ణ, గంటాడ బోసు బాబు తదితరులు పాల్గొన్నారు.

-పాల్వంచ టౌన్





సమయస్ఫూర్తి... సమన్వయం...

విపత్తుల సమయాల్లో ఎలా వ్యవహరించాలి..? అనే అంశంపై శిక్షణ సమయంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాలపై పాఠాలు బోధించడం వరకే శిక్షణలో సాధ్యమవుతుంది. కానీ ఆ విపత్తుల అనుభవం ఎలా ఉంటుందో ఖమ్మం మున్నేరు వరదల ద్వారా యువ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ప్రత్యక్షంగా తెలుసుకోగలిగారు. గత నెల 31న రాత్రి పొంగి ప్రవహించిన మున్నేరు వరద 24 గంటలపాటు ప్రజలను అతలాకుతలం చేసింది. ఇళ్లు మునిగిపోయి సర్వం కోల్పోయారు. ఈ సమయంలో గతంలో అనుభవం లేకపోయినా పరిస్థితులను గమనిస్తూ అప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకుంటూ యువ ఆఫీసర్లు అడుగులు ముందుకు వేశారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పోలీసు కమిషనర్ సునిల్‌దత్, అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ట్రెయినీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూజ వరద సహాయక చర్యల్లో తమదైన పాత్ర నిర్వర్తించారు.

- మున్నేరు వరదల వేళ యువ ఐఏఎస్‌ల చురుకైన పాత్ర
- తొలిసారిగా విపత్తు ఎదురైనా దీక్షాదక్షతలతో ముందుకు...
- కెరీర్ తొలి దశలోనే అనూహ్య అనుభవాలు, విలువైన పాఠాలు...
- సహాయక చర్యలు, నిరాశ్రయులను ఆదుకోవడంలో సమష్టిపాత్ర
- ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనలను ఫలవంతం చేయడంలో టీమ్‌వర్క్
- కేంద్ర బృందానికి నష్ట తీవ్రత కళ్లకు కట్టేలా వివరణ
- సహకరించిన వివిధ శాఖల ఉన్నతాధికారులు

ఖమ్మం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 2017 బ్యాచ్‌కు చెందిన ముజమ్మిల్‌ఖాన్ ఈ ఏడాది జూన్ 16న బాధ్యతలు స్వీకరించారు. మూడునెలలు గడవకముందే మున్నేరు వరద ఒక్కసారిగా వచ్చి పడింది. మున్నేరు వరద ప్రవాహం జనావాసాలను ముంచెత్తిన క్రమంలో ముజమ్మిల్‌ఖాన్ సహాయక కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించారు. వరదలు వచ్చిన తర్వాత తగ్గిన తర్వాత సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. తనతోపాటు జిల్లా అధికారులను సహాయ కార్యక్రమాల్లో పనిచేసేలా చూడగలిగారు. రాకాసితండాలో చిక్కుకున్న వారి ప్రాణాలు కాపాడే విషయంలో, ప్రకాష్‌నగర్ వారధిపై చిక్కుకున్నవారిని కాపాడేందుకు శ్రమించారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రుల పర్యటనను కూడా ఇబ్బందులు లేకుండా చేసి నష్టంపై నివేదికలు అందించగలిగారు. అన్ని ప్రభుత్వ శాఖలను సమాయత్తం చేసి సర్వేల ద్వారా నివేదికలు తెప్పించి కేంద్ర బృందం పర్యటనలో ఫోటోలు, వీడియోలు, పంటల నష్టం నివేదికలను సకాలంలో అందించారు.

సీపీ సునిల్‌దత్

2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సునిల్‌దత్ ఖమ్మం జిల్లా పోలీసు కమిషనర్‌గా ఈ ఏడాది జనవరి 5న బాధ్యతలు చేపట్టారు. సునిల్‌దత్‌కు ఖమ్మం వరదలు కొత్త అనుభవాన్ని నేర్పాయి. వరదల సమయంలో పోలీసుశాఖ ఎలా ఉండాలో చూపించగలిగారు. మున్నేరు వరద పొంగిన నాటినుంచి కలెక్టర్‌తో కలిసి పర్యటిస్తూ పోలీసుయంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వాగులు, బ్రిడ్జిలను దాటకుండా ఉండేందుకు బందోబస్తు ఏర్పాటుచేయడంతో పాటు పోలీసుయంత్రాంగాన్ని వరద సహాయ కార్యక్రమాల్లో నిమగ్నం చేశారు. కలెక్టర్‌తో కలిసి రాకాసితండా, మున్నేరు బ్రిడ్జిపై చిక్కుకున్న వారిని రక్షించేందుకు చర్యలు తీసుకున్నారు. వరద తగ్గిన తర్వాత కూడా పారిశుధ్య కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో పోలీసులు పాలుపంచుకొని, సహాయ కార్యక్రమాల్లో దిశ దశ నిర్దేశించారు.

కేఎంసీ కమిషనర్ అభిషక్ అగస్త్య

ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) కమిషనర్‌గా అభిషక్ అగస్త్య బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే వచ్చిన వరద వేలాది కుటుంబాలును అతలాకుతలం చేసింది. మున్నేరు వరద పెరుగుతున్న నాటి నుంచి తగ్గేతంతవరకు అభిషక్ శ్రమించి సేవలందించారు. ఇప్పటికీ సేవా కార్యక్రమాల, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదికలు,సర్వేలు వంటి కార్యక్రమాల్లో బిజీబిజీగా విధులు సాగిస్తున్నారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన అభిషక్.. మేడ్చల్, మల్కాజిగిరిలో అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. గతంలో వరద సహాయ కార్యక్రమాల్లో ఎక్కడా ప్రత్యక్షంగా పాల్గొనలేదు. అయినా వరద బాధితుల తరలింపు, సహాయ కార్యక్రమాల నిర్వహణలో చురుకైన పాత్ర నిర్వర్తించారు.



ఖమ్మంలో మున్నేరు వరద సృష్టించిన బీభత్సానికి సాక్ష్యం ఈ దృశ్యం...

నిబద్ధతతో ముందుకు సాగిన ఇతర అధికారులు

జిల్లా అదనపు కలెక్టర్‌గా ఉన్న మధుసూదన్‌నాయక్, ట్రైనీ ఐఏఎస్ మృణాల్‌శ్రేష్ట సైతం వరద సహాయ కార్యక్రమాల్లో కీలకంగా వ్యవహరించారు. అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ అన్నిసేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ కలెక్టర్ ఆదేశాలను క్షేత్రస్థాయిలో అధికారులకు అందిస్తూ వరద సహాయ కార్యక్రమాల్లో నిరంతరం శ్రమించారు. అలాగే ట్రైనీ ఐఏఎస్ అధికారి మృణాల్‌శ్రేష్ట కార్పొరేషన్ కమిషనర్‌కు సహాయకుడిగా వ్యవహరిస్తూ సరికొత్త అనుభవాన్ని సాధించారు. భవిష్యత్తు విధినిర్వహణలో ఎలాంటి వరద విపత్తులు వచ్చినా మనోధైర్యంతో ముందుకు పోయే అనుభవం ఆయనకు లభించింది. అలాగే స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా వచ్చిన శ్రీజకూడా వరద బాధితుల సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. సర్వేడేటాలు అనుసంధానం చేయడం, నష్టం వివరాలు సేకరించడం వంటి పనుల్లో నిమగ్నమయ్యారు.

పోలీసు, రెవెన్యూ , వ్యవసాయం, ఎడ్యుకేషన్, హెల్త్, ఇరిగేషన్,ట్రాన్స్‌కో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మత్స్యశాఖ, పంచాయతీ, మునిసిపాలిటీతో పాటు పశుసంవర్థక, ఉద్యానశాఖల అధికారులు సిబ్బంది సైతం వరద నష్టం అంచనాలు సిద్ధంచేయడంలో, సర్వేలు, సహాయ కార్యక్రమాల్లో సెలవులు సైతం పక్కనబెట్టి భాగస్వామ్యం అయ్యారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు కేంద్ర బృందం పర్యటనలో పాలుపచుకుంటూ నష్టాలను సర్వేలు అంచనా వేశారు.

మొత్తంమీద భారీవర్షాలతో వచ్చిన ముంపు జిల్లా అధికార యంత్రాగానికి ఒక అనుభవం నేర్పిందనే చెప్పాలి. మండల అధికారులు కొత్తగా వచ్చిన వారు ఇబ్బంది పడ్డా జిల్లాస్థాయిలో ఉన్న అధికారులంతా ఒక టీం వర్కుగా ముందుకు కదిలారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు కూడా వరదలసమయంలో స్థానికంగా ఉండి అధికారులకు దశ దిశ నిర్దేశించారు.

రామాలయ అభివృద్ధికి రంగం సిద్ధం

- భూ సేకరణకు రూ.60.20 కోట్లు కేటాయింపు
- జీవో జారీ
- పూర్తిస్థాయి సర్వే చేయనున్న అధికారులు



భద్రాచలంలో భూ సేకరణ చేసే ప్రాంతం ఇదే...

భద్రాచలం, సెప్టెంబరు 13: దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ అభివృద్ధి పనుల భూసేకరణకు రంగం సిద్ధమవుతోంది. ఆలయ అభివృద్ధి పనులను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా ఉన్న క్రమంలో ఇందుకోసం రూ.60.20 కోట్లు ప్రత్యేక అభివృద్ధి నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా జీవో నెం.246ను జారీ చేశారు. దీంతో రామాలయ అభివృద్ధి పనులకు భూసేకరణ చేపట్టేందుకు అధికారికంగా ఆమోద ముద్ర లభించినట్లు అయ్యింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో భాగంగా ఈ పనులను చేపట్టనున్నారు. రూ.60.20 కోట్ల నిదులతో భూసేకరణ పరిహారం చెల్లింపుతో పాటు నిర్వాసితులకు ఆర్.అండ్.ఆర్ ప్రయోజనాలు, కాలనీలో మౌలిక సదుపాయల కల్పన చేపట్టనున్నారు.

సాకారం దిశగా నవ్య భద్రాద్రి

ఈ ఏడాది మార్చి 11న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భద్రాచల రామయ్యను దర్శించారు. ఈ సమయంలో రామాలయ అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని, ఎన్ని నిధులైనా వెచ్చించేందుకు సిద్దమని సీఎం ప్రకటించారు. ఇదే సమయంలో ఆలయ అభివృద్ధికి అవసరమైన మేరకు నిర్వాసితులతో సానుకూలత రాబట్టేలా చర్చలు జరిపి ఒప్పించాలని కోరారు. ఈ సమయంలో ఎంత స్థలం కావాలో తేల్చి నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని అప్పటి కలెక్టర్ ప్రియాంక అలాను ఆదేశించారు. ఈ నేపథ్యంలో మార్చి 27న రామాలయ అభివృద్ధిపై క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేసేందుకు ఆర్కిటెక్ట్ సూర్యనారాయణమూర్తి వచ్చి రామాలయం చుట్టూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నివేదికను రూపొందించారు.

పూర్తిస్థాయి సర్వేకు రంగం సిద్ధం

ఇప్పటి వరకు ప్రాథమిక సర్వేను నిర్వహించిన అధికారులు పూర్తిస్థాయిలో సర్వేను చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా ప్రాథమికంగా 43 ఇళ్లను తొలగించాల్సి వస్తుందని అంచనా వేశారు. ఈ క్రమంలో పూర్తిస్థాయి సర్వే త్వరలో నిర్వహించనున్నట్లు భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఇందుకు సంబంధించి దేవాదాయ శాఖ నుంచి అధికారిక లేఖ, మ్యాప్, సరిహద్దులపై వివరాలు అందజేయాల్సి ఉందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా భూసేకరణ పూర్తికావడానికి సుమారుగా ఆరు నెలల సమయం పడుతుందని తెలుస్తోంది. ఇదే సమయంలో గతంలో భూ సేకరణ చేయాల్సిన ఏడు ఇళ్ల యజమానులకు ఇప్పటికే నోటీసులు జారీ చేయడంతో వాటిని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంది.

4 నుంచి శరన్ననవరాత్రి ఉత్సవాలు

- 12న ఆయుధ పూజ, శ్రీరామలీల మహోత్సవం
- ఉత్సవాలను ఖరారు చేసిన భద్రాద్రి వైదిక బృందం

వివరాలు : 6లో

ప్రజల వద్దకే పరిపాలన

- 6 జోన్లుగా ఖమ్మం నగర పాలక సంస్థ విభజన
- కార్యాచరణ ప్రారంభించిన అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 30: ప్రజల వద్దకే పరిపాలన నినాదంతో ఖమ్మం నగర పాలక సంస్థ పరిపాలన విభాగంలో విధాన పరమైన సమూల మార్పులకు కార్యచరణ జరుగుతోంది. హైదరాబాద్‌లోని జీహెచ్‌ఎంసీ తరహాలోనే ఖమ్మం నగరంలోని 60 డివిజన్లను ఆరు జోన్లుగా విభజన చేసి ప్రతి జోన్‌కు పది డివిజన్లు కేటాయించి స్థానికంగానే కార్యాలయం ఏర్పాటు చేసేందుకు ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య చర్యలను ప్రారంబించారు. ఇప్పటికే ఆరు జోనల్ కార్యాలయాలను అధికారులు పరిశీలించారు. ఇటీవల మున్నేరుకు వరద పోటు 40 అడుగుల వరకు రావటంతో విపత్తుగా ఏర్పడింది. పూర్తి స్థాయిలో కొలుకున్న తర్వాత తిరిగి జోనల్ కార్యాలయాల ఏర్పాటు కార్యాచరణ వేగవంతం కానుంది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో ఇక మీదట ప్రతి 10 డివిజన్లకు ఒక జోనల్ కార్యాలయం ఏర్పాటు జరగనుంది. ప్రతి జోనల్ కార్యాలయంలో లైజనింగ్ అధికారి పర్యవేక్షణలో కేఎంసీ రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, ఇంజనీరింగ్, ఇతర విభాగాలను ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఆయా విభాగాలకు చెందిన అనుభవం కలిగిన అధికారులను బాధ్యులను కేటాయించనున్నారు. విలీన గ్రామాలు, డివిజన్ల నుంచి ఫిర్యాదుదారులు కార్యాలయం వరకు రాకుండానే స్థానికంగా ఉన్న జోనల్ కార్యాలయానికి వెళ్తే సత్వర పౌర సేవలు పారదర్శకంగా అందించేందుకు కార్యాచరణ జరుగుతుంది. ఎన్టీఆర్ సర్కిల్, నయాబజార్, ముస్తాఫానగర్, గాంధీచౌక్, మమతా రోడ్డు, రాపర్తినగర్ ప్రాంతాల్లో జోనల్ కార్యాలయాలు ఏర్పాటు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి.

పరిపాలన వికేంద్రీకరణ కోసమే: అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

ఖమ్మం నగరం బాగా విస్తరిస్తోంది. 60 డివిజన్లలో మారుమూల ప్రాంతాల నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి పౌర సేవలకు రావటానికి కష్టంగా ఉంది. ప్రజల కోసం అధికార వికేంద్రీకరణలో భాగంగా హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ తరహాలో ఆరు జోనల్ కార్యాలయాలు ఏర్పాటు కార్యాచరణ చేస్తున్నాం.

ఓటి చెరువు పేరిట నిధుల లూటీ

- 1977లో అప్పటి సీఎం వెంగళరావు హయాంలో నిర్మాణం
- 600 ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా రూపకల్పన
- దశాబ్దాలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో లేని నిర్వహణ
- చెరువు, కాలువల్లో ఎక్కడ చూసినా లీకులే..
- ఏటా మరమ్మతుల పేరిట నిధుల స్వాహా



తిరుమలకుంట ఓటి చెరువు



పగిలిన పైపు లైన్

అశ్వారావుపేట, సెప్టెంబరు 12: కోట్లు వెచ్చించి ప్రాజెక్టులు నిర్మిస్తున్న ప్రభుత్వాలు... వాటి నిర్వహణను పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో నిష్ప్రయోజనంగా మిగిలిపోతున్నాయి. ఇలాంటిదే అశ్వారావుపేట మండలం తిరుమలకుంట సమీపంలోని ఓటి చెరువు పరిస్థితి. 1977లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు హయాంలో ఓటి చెరువును నిర్మించారు. సుమారు 600 ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించేందుకు ఈ ప్రాజెక్టుకు అప్పట్లో రూప కల్పన చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మించి ఐదు దశాబ్దాలు కావస్తున్నప్పటికీ పూర్తిస్థాయి ఆయకట్టుకు ఇప్పటి వరకు ఒక్క ఏడాది కూడా నీటిని అందించలేకపోయింది. ప్రస్తుతం కొద్ది పాటి ఆయకట్టుకు, కింద భాగంలో ఉన్న చెక్‌డ్యామ్ ద్వారా ముత్యాల చెరువు నింపడానికి మాత్రమే ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతోంది.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలో ఈ చెరువుకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టారు. ఆ తరువాత పూర్తిస్థాయిలో నిధులు మంజూరైన దాఖలాలు లేవు. అపుడప్పుడు మంజూరైనప్పటికీ చేసిన పనులే మరలా అంచనాలు వేసి చేయడం తప్ప ప్రణాళిక బద్ధంగా చేపట్టలేదనే విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో కట్ట బలహీనపడి 2006లో వచ్చిన భారీ వర్షాలకు కట్టకు భారీ గండి పడింది. అప్పట్లో గండి పూడ్చటానికి, తదుపరి కట్ట పటిష్ఠత, కాలువ పనుల కోసం అంటూ నిధులు మంజూరు చేశారు. కాని వాటిని ప్రణాళికబద్ధంగా చేపట్టకపోవడంతో ప్రాజెక్టును పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేలేకపోయారు. తూతూ మంత్రంగా పనులు చేపట్టి బిల్లులు డ్రా చేసేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇప్పటికి ఈ ప్రాజెక్టు శిథిలావస్థలో ఉండి, రైతులకు ఉపయోగం లేకుండా పోతోంది.

పైపులైన్లు, అలుగువద్ద లీకులు....

ఈ ప్రాజెక్టుకు కుడి ఎడమ తూములు ఏర్పాటు చేయడం ద్వారా తిరుమలకుంట, పాకలగూడెం, తిరుమలకుంట కాలనీ, ఉశిర్లగూడెం, మద్దిగూడెం గ్రామాలకు సుమారుగా 600 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేలా డిజైన్ చేశారు. ఈ ప్రాజెక్టు ఆయకట్టులో ఉన్న ముత్యాలమ్మ చెరువులోకి అలుగునీటిని నింపేలా వాగుపై చెక్‌డ్యామ్‌ను నిర్మించి ఆ నీటిని చెరువులోకి మళ్లించి అదనపు ఆయకట్టుకు నీటిని అందించేలా కట్టడాలు నిర్మించారు. వీటన్నింటి కోసం కోట్లాది రూపాయలు వెచ్చించారు. కుడి ఎడమ కాలువల కోసం భూ సేకరణ చేసి, వాటిలో కాలువలను నిర్మించారు.

భూ సేకరణ, నిర్మాణాల కోసం రూ. కోట్లు ప్రభుత్వానికి ఖర్చు అయ్యింది. ప్రస్తుతం ఎడమ కాలువ పూర్తిగా పూడిపోయి ఆనవాళ్లు లేకుండా పోయింది. పొలాల్లో కలసి పోయి చదునుగా మారిపోయింది. మరో కాలువ ప్రాజెక్టు నుంచి

(మిగతా 6వ పేజీలో)

17న 'ప్రజాపాలన'

- వేడుక నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలి
- జెండా ఎగురవేయనున్న డిప్యూటీ సీఎం
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ 17న ఉదయం 10 గంటలకు ఖమ్మం పరేడ్ మైదానంలో తెలంగాణ ప్రజాపాలన వేడుకలు జరుగుతాయని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్యతిథిగా హాజరై జాతీయపతాకం ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

ఉదయం ముఖ్యఅతిథి గౌరవ వందనం స్వీకరించి జాతీయ జెండా ఎగురవేసి సందేశాన్ని వినిపిస్తారని, ఆతర్వాత స్టాల్స్ సందర్శన, ఉంటుందని, అభయ హస్తం గ్యారంటీ పథకాల అమలుకు స్టాల్స్ ఏర్పాటు చేయాలని తెలిపారు. పోలీసు పరేడ్ మైదానంలో జరిగే ప్రజాపాలన దినోత్సవానికి అధికారులంతా హాజరుకావాలని జిల్లాలో ప్రతి అధికారి కార్యాలయం, గ్రామ పంచాయతీ, మునిసిపల్ కార్యలయాలను ప్రజాపాలన వేడుకల సందర్భంగా జాతీయ జెండా ఎగురవేయాలని ఆదేశించారు.

పోలీసు కమిషనర్ సునిల్‌దత్ మాట్లాడుతూ వరదల తరుణంలో పోలీసుశాఖ సిబ్బంది, అధికారులతో పాటు అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు ప్రశంసనీయంగా పనిచేశారని ప్రశంసించారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్, ట్రైనీ కలెక్టర్ మృణాల్‌శ్రేష్ట, డీఆర్వో రాజేశ్వరితో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



తండ్రి సీట్లో కూర్చుని పెత్తనం చేస్తున్న కొడుకు

తండ్రి సీటులో కొడుకు..

» ఏకఛవోగా పెత్తనం చేస్తున్న కొడుకు

పాల్వంచ, సెప్టెంబరు 13: అతనో ప్రభుత్వ ఉద్యోగి కుమారుడు.. కానీ తండ్రి సీటులో కూర్చొని పెత్తనం చేస్తున్నాడు.. ఎన్నో నెలలుగా సాగుతున్న ఈ తతంగం తాజాగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పాల్వంచ మండలం జగన్నాథపురం అగ్రికల్చర్ క్లస్టర్‌కు ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్‌గా సత్యనారాయణ విధులు నిర్వహిస్తున్నాడు. అతడు బిజీగా ఉన్నప్పుడు అతడి పుత్రరత్నం పనులను చక్కదిద్దుతుంటాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగన్నాథపురం క్లస్టర్ పరిధిలోని రైతులను వేధిస్తున్నట్లుగా తెలుస్తోంది. రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతు కుటుంబీకుల నుంచి లంచం డిమాండ్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తండ్రి కుర్చీని అడ్డుపెట్టుకుని పుత్రరత్నం చేస్తున్న ఈ దందా తండ్రికి తెలిసే జరుగుతుందా, లేక తెలియకుండా జరుగుతుందా అనేది తెలియాల్సి ఉంది. ఈ విషయమై మండల వ్యవసాయ శాఖ అధికారి శంకర్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి ఇప్పుడే వచ్చిందని, విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించాలి

» రూట్ మ్యాప్ ముందస్తుగానే నిర్దేశించుకోవాలి

» జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన సీపీ సునిల్‌దత్

ఖమ్మం, సెప్టెంబరు 13: ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించడానికి ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టర్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్‌లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో సెప్టెంబరు 16న సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం కూడా విగ్రహాల నిమజ్జనం కొనసాగుతుందని, దీని కోసం అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనానికి సంబంధించి ఖమ్మం నగరం, వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీలలో అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని. సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో, గ్రామపెద్దలతో ముందస్తుగానే సమావేశాలు నిర్వహించి ప్రశాంతంగా వినాయక నిమజ్జనం నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమ సహకారం అందించేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు సెప్టెంబరు 16న వెయ్యికి పైగా విగ్రహాలు, సెప్టెంబరు 17న 800 నుండి 900 వరకు విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందని, దీనికి వీలుగా ప్లాట్ ఫారం వద్ద అవసరమైన క్రేన్ లు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. నిమజ్జన ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లతో పాటు పడవలను అందుబాటులో ఉంచాలని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ అధికారి సిద్దార్థ విక్రం సింగ్, ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు.. విద్యుత్‌శాఖ కంట్రోల్ రూం



ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 13: గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా శాఖాపరంగా అన్ని చర్యలను తీసుకొన్నట్లు, ప్రత్యేకంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేసినట్లు విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేందర్ శుక్రవారం ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా భక్తులు విద్యుత్ అవసరాల కోసం 9440811525 కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని సూచించారు. భక్తులు గణేష్ విగ్రహాల తరలింపు సమయంలో స్థానికంగా ఉన్న విద్యుత్ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు.

జీపీ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

» జిల్లాలో 22 మండలాల్లో 479 పంచాయతీల్లో 6,82,858ఓట్లు

» తుదిజాబితా 28వ తేదీన వార్డుల వారీగా విడుదల

కొత్తగూడెం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రామ పంచాయతీల ఓటర్ల ముసాయిదా జాబితాను శుక్రవారం అడిషనల్ జిల్లా ఎన్నికల అధికారి అయిన డీపీవో బాబురావు విడుదల చేశారు. ఈ నెల 28వ తేదీన పంచాయతీల తుదిజాబితాను విడుదల చేసి అయా పంచాయతీల్లో వార్డుల వారీగా పబ్లిష్ చేస్తారు. ఈ నెల 18వ తేదీన జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 19వ తేదీన మండల స్థాయిలో ఎంపీడీవో ఆధ్వర్యంలో మండల స్థాయి రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో సమీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే అయా పరిధిలో అధికారులు స్వీకరించనున్నారు. ఈ నెల 26వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి ఓటర్ల జాబితా అభ్యంతరాలపై నిర్ణయం తీసుకుంటారు. తుదిజాబితాను 28న గ్రామపంచాయతీ వార్డుల వారీగా పబ్లికేషన్ చేయనున్నారు.

జిల్లాలో మొత్తం 22 మండలాల్లో 484 గ్రామపంచాయతీలు ఉండగా వాటిల్లో 479 గ్రామపంచాయతీల్లో ఓటర్ల జాబితా పబ్లికేషన్‌ను నిర్వహిస్తున్నారు. మిగిలిన ఐదు గ్రామపంచాయతీలు భద్రాచలంలో మూడు, సారపాకలో రెండు గ్రామపంచాయతీలో విలీనం చేయడంతో వాటిని పబ్లికేషన్‌కు నోచుకోవడం లేదు. దీంతో 479 గ్రామపంచాయతీలకు గాను మొత్తం ఓటర్లు 6,82,858 ఉన్నారు. వీరిలో పురుషులు 3,32,940మంది, మహిళలు 3,49,893మంది, ఇతరులు 25మంది ఉన్నారు. జిల్లాలో మండలాలవారీగా ఆళ్లపల్లి మండలంలో 9,092 ఓటర్లు ఉండగా అన్నపురెడ్డిపల్లి 16,627, అశ్వాపురం 32,908, అశ్వారావుపేట 46,624, భద్రాచలం 40,150, బూర్గంపాడు 49,509, చంద్రుగొండ 23,456, చర్ల 31,917, చుంచుపల్లి 38,789, దమ్మపేట 43,834, దుమ్ముగూడెం 36,009, గుండాల 12,948,జూలూరుపాడు 12,697, కరకగూడెం 27,578, లక్ష్మీదేవిపల్లి 31,793, మణుగూరు 35,952, ములకలపల్లి 27,632, పాల్వంచ 28,402, పినపాక 26,885, సుజాతనగర్ 22,898, టేకులపల్లి 41,064, ఇల్లెందు 46,094 మండలాల్లో ప్రస్తుతానికి ఓటర్లు ముసాయిదాను అయా గ్రామ పంచాయతీల్లో పబ్లికేషన్ కోసం విడుదల చేశారు. భద్రాచలంలో విలీనమైనటువంటి మూడు గ్రామపంచాయతీలైన భద్రాచలం, సీతారాంనగరం, శాంతినగరంతో పాటు సారపాకలో విలీనమైన సారపాక, ఐటీసీ గ్రామపంచాయతీలకు మాత్రం పబ్లికేషన్ ఇవ్వలేదు. ఈ ఐదు గ్రామపంచాయతీలు నగర పంచాయతీలుగా ఉంటాయా- గ్రామపంచాయతీలుగా ఉంటాయా అనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడంతో ప్రస్తుతానికి పబ్లిష్ చేయలేదు.

ఎస్సీ విద్యార్థులకు ఉన్నత అవకాశం

» నూతనంగా జాతీయ స్థాయిలో విదేశీ విద్యా ఉపకార వేతనాలు

» 2024-2025 విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి

» జిల్లాలో 125 మంది విద్యార్థులకు అవకాశం



ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 13: ఇప్పటి వరకు కేవలం రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మాత్రమే ఎస్సీ విద్యార్థులకు విదేశీ విద్యా ఉపకార వేతనం అవకాశం ఉంది. అది కూడా నిర్ణీత స్థాయిలో ఉండటంతో పదుల సంఖ్యలో ఎస్సీ విద్యార్థులు విదేశీ ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లి ప్రభుత్వం సహాయం పొందలేక పోయారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థులు విదేశీ చదువులకు వెళితే ఉన్నత విద్యా ఉపకార వేతనాలను అందించేందుకు నూతనంగా కొత్త పథకాన్ని ప్రవేశ పెట్టింది. జాతీయ విదేశీ విద్యా పథకం ద్వారా ఈ ఏడాది 2024-2025 విద్యా సంవత్సరం నుంచే ఎస్సీ విద్యార్థులకు అవకాశం కల్పించింది. వివరాలను శుక్రవారం ఖమ్మం సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణ తెలిపారు.

జాతీయ విదేశీ విద్యా ఉపకార వేతనం కోసం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి సంవత్సరం 125 మంది విద్యార్థులకు అవకాశం ఉంది. ఇందులో 115 మంది ఎస్సీ కూలాలు, ఆరుగురు పాక్షిక సంచార జాతులు, నలుగురు భూమి లేని వ్యవసాయ కూలీలు లేదా సంప్రదాయ కళాకారులకు అవకాశం కల్పించారు. వార్షిక ఆదాయం ఏడాదికి రూ.8 లక్షల లోపుగా ఉండాలి. విద్యార్థులు ఏప్రిల్ 1వ వరకు 35 ఏళ్లలోపు వయస్సు కలిగి ఉండాలి. జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థులు ఎన్‌వోఎస్ఎం ఎస్‌జేఈ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నందు దరఖాస్తులు చేసుకోవాలి. విద్యార్థులు డిగ్రీలో 60శాతం ఉత్తీర్ణత మార్కులు సాధించి ఉండాలి. ప్రతి విద్యార్థి ఏడాదిలో రెండు సార్లు దరఖాస్తులు చేసుకొనే వీలు కల్పించారు. మొదటి దరఖాస్తును ఫిబ్రవరి మాసం నుంచి 45 రోజులు గడువు ఉంటుంది. రెండోసారి దరఖాస్తులు చేసేందుకు సెప్టెంబరు 1 నుంచి 45 రోజులు వరకు గడువును కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

'చట్టాల రూపకల్పనలో సీతారాం ఏచూరి పాత్ర కీలకం'



ఏచూరి సంస్మరణ సభలో సంతాపం వ్యక్తం చేస్తున్న సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 13: దేశానికి దిశానిర్దేశం చేసే పలు కీలక చట్టాల రూపకల్పనలో సీతారాం ఏచూరి పాత్ర ఎంతో కీలకమని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సీపీఎం కార్యాలయంలో దివంగత సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న వివిధ పార్టీల నేతలు ఏచూరి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ వామపక్ష ఉద్యమంలో ఒక అరుణతార రాలిపోయిందన్నారు. సీతారాం ఏచూరి సిద్ధాంతం కమ్యూనిస్టులకు ఒక ప్రేరణ, స్ఫూర్తిదాయకమని సంస్మరణ సభలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ఐలూ రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ స్టడీ అండ్ స్ట్రగుల్ సిద్ధాంతాన్ని ఎస్ఎఫ్ఐకి ఆపాదించిన ఘనత ఏచూరిదే నన్నారు. 1978లో తాను ఎస్ఎఫ్ఐలో పనిచేస్తున్నప్పుడు తాను ఏచూరిని తొలిసారిగా కలిశానని గుర్తు చేసుకున్నారు.

ఈ సంస్మరణసభలో సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండాల కృష్ణ, సీపీఎం రాష్ట్ర నాయకులు పి. సోమయ్య, కాంగ్రెస్ రైతు సంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, సీపీఎం నాయకులు మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఏపూరి లత, తెలంగాణా ఫ్రంట్ నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఎం. సుబ్బారావు, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీలో వ్యాపార లైసెన్స్ మేళా

» ఉమ్మడి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 13: చిన్న వ్యాపారులైన సరే తప్పని సరిగా వ్యాపార లైసెన్స్‌లు తీసుకొవాలని ఉమ్మడి జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా వ్యాపార లైసెన్స్ మేళా క్యాంపు నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో 19, భద్రాది కొత్తగూడెం జిల్లాకు చెందిన 10 మందికి నూతనంగా వ్యాపార లైసెన్స్‌లు కోసం దరఖాస్తులను అందించారు. వీరికి ఆన్‌లైన్‌లో త్వరలో దరఖాస్తులు అందుతాయని ఫుడ్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

నిరుద్యోగులు అవకాశాలు వినియోగించుకోవాలి

» జాబ్ మేళాలో జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్

చుంచుపల్లి, సెప్టెంబరు13: నిరుద్యోగులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి శ్రీరామ్ సూచించారు. శుక్రవారం చుంచుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జాబ్ మేళాలో నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ఉపాధి పొందేందుకు స్థానికంగా ఉన్న వనరులను అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. హోమ్ కేర్ నర్సింగ్ సర్వీసెస్ పోస్టుల ఇంటర్వ్యూలను 23 మంది అభ్యర్థులు హాజరు కాగా 15 మందిని మెరిట్ లిస్ట్ ప్రకారం వేరు చేసి, ఆరుగురికి నియామక పత్రాలను అందజేశారు.

ఓటి చెరువు పేరిట

నిధుల లూటీ



అలుగు నుంచి నీరు వృథాగా పోతున్న దృశ్యం

(5వ పేజీ తరువాయి)

అర కిలోమీటరు మేర మాత్రమే కనిపిస్తుంది. మిగతాది పూడుకొని పోయింది. రెండు, మూడేళ్ల క్రితం కొంత నిధులు వెచ్చించి కాల్వ సీసీ లైనింగ్‌ను కొంత మేర నిర్మించారు. అది గత ఏడాది కొంత మేర కూలిపోయింది. మిగిలిన లైనింగ్ కూలడానికి సిద్ధంగా ఉంది. ప్రస్తుతం ఈ చెరువుకు అమర్చిన తూములు పనిచేయడం లేదు. రెండు తూములు లీకులు అవుతుండటంతో వర్షాల సమయంలో రైతులే ఇసుక బస్తాలు వేసుకొని కొంత మేర నీటిని ఆపుకుంటున్నారు. తూముకు అమర్చిన గేట్లు స్తంభించి పోయాయి. అలుగు భాగంలో, తూముల వద్ద ఎక్కడ చూసిన నీరు లీకులు అవుతుండడంతో ప్రాజెక్టులోని నీరు వృథాగా పోతుంది.

నాలుగేళ్ల క్రితం మంజూరైన నిధులతో తూములు, గేట్లు కొత్తగా అమర్చారు. ఎడమ కాలువ పటిష్ఠత కోసం నిధులు వెచ్చించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ పనులను అప్పట్లో వర్షాకాలం ముందు ప్రారంభించారు. వర్షాలు వచ్చే సమయానికి సగం పనులే అయ్యాయి. మిగతావి వర్షాకాలం అనంతరం పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. కాని ఆ తరువాత చేసిన పనులు అంతంత మాత్రంగానే జరిగాయని రైతులు చెబుతున్నారు. అంతేకాక చేసిన పనులు ఉపయోగంలోకి రాకుండా పోయాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓటి చెరువు పనులను పూర్తి స్థాయిలో చేపట్టి వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

60 ఏళ్లలో తొలిసారి...



ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

» మున్నేరు మహోగ్రరూపం దాల్చింది ఇప్పుడే..

» ఖమ్మంలో 36 అడుగులు, ఏపీలోని కీసరలో 37.6 అడుగుల ఎత్తులో ప్రవాహం

» ఎన్నడూలేని విధంగా వరద పొంగడం వల్లే ఖమ్మం అతలాకుతలం

» గడిచిన 15 సంవత్సరాల్లో 30 అడుగులకు తగ్గని వరద

» రెండు రాష్ట్రాలపైన ప్రభావం చూపిన నది

» అతలాకుతలమైన జనజీవనం

ఖమ్మం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్నేరు నది ప్రవాహం వరంగల్ జిల్లా పాకాల సరస్సు వద్ద మొదలై ఖమ్మం, నల్గొండ, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మీదుగా పులిచింతలకు దిగువన 20 కి.మీ. వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. అయితే ఈ యేడాది మున్నేరు తెచ్చిన ముంపు పెద్ద ముప్పుగా మారింది. గతంలో ఎన్నడూ లేనిస్థాయిలో రెండు తెలుగు రాష్ట్రాలను అతలాకుతలం చేసింది. మహబూబాబాద్ నుంచి మొదలుకుని ఏపీలోని కీసర వరకు దాని ప్రభావం చూపుతూ ప్రవాహం కొనసాగించింది. అయితే గడిచిన 60 యేళ్ల చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఈ యేడాది వరద తీవ్రత కొనసాగినట్టుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) కీసరలో తీసుకున్న శాటిలైట్ కొలత ప్రకారం ప్రస్తుతం మున్నేరు 37.6 అడుగుల ఎత్తున ప్రవహించింది.

రెండుసార్లు అత్యధిక తీవ్రత

సెంట్రల్‌వాటర్ కమిషన్(సీడబ్ల్యూసీ) లెక్కల ప్రకారం పదిహేనేళ్లల్లో రెండుసార్లు మాత్రమే మున్నేరు వరద తీవ్రత అత్యధికంగా ఉండగా.. ఈ యేడాది నమోదైన ప్రవాహం దాని చరిత్రలోనే అత్యధికంగా ఉన్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 37.6 అడుగులు, 2005లో ఒక సారి 35.66 అడుగులు మేర ప్రవహించగా, 2023-24లో 34.3 అడుగులు ప్రవహించినట్టు లెక్కల్లో పేర్కొంది. అయితే గడిచిన పదిహేనేళ్లలో 30 అడుగులకు తక్కువగా ప్రవహించిన దాఖాలాలు లేని పరిస్థితి ఉండగా.. ముంపు ముప్పుకు గురైన ప్రాంతాల సంఖ్య మాత్రం పెరుగుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి.

గత పదిహేనేళ్లలో సీడబ్ల్యూసీలో నమోదైన మున్నేరు ప్రవాహం తీరు ..

2001లో 30.48 అడుగులు, 2002లో 30.37, 2003లో 31.26, 2004లో 31.58, 2005లో 35.66, 2006లో 33.7, 2007లో 31.1, 2008లో 34.15, 2009లో 31.63, 2010లో 31.67, 2011లో 30.75, 2012లో 33.15, 2013లో 31.81, 2014లో 30.58, 2015లో 31.65, 2016లో 32.02, 2017లో 30.28, 2018లో 33.04, 2019లో 30.78, 2020లో 33.68, 2021లో 33.1, 2022లో 31.8, 2023లో 34.3, 2024లో 37.6 అడుగులుగా నమోదైంది.

తెలంగాణలోని మున్నేరు నది ప్రవహించే మహబూబాబాద్ జిల్లా డోర్నకల్, ఖమ్మం రూరల్ మండలంలోని కామంచికల్, ఖమ్మం నగరంలోని దానవాయిగూడెం, మంచికంటినగర్, కాల్వొడ్డు, మోతీనగర్, ప్రకాష్ నగర్, ధంసలాపురం, వెంకటేశ్వరనగర్, బొక్కలగడ్డ వంటి ప్రాంతాలతో పాటుగా ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాలోని చిన్నమండవ, లింగాల, పెనగంచిప్రోలు, కీసర ప్రాంతాలతోపాటుగా సమీప ప్రాంతాలు సైతం ముంపునకు గురయ్యాయి. ఇరు రాష్ట్రాల్లో పదులసంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోగా, వేలాది ఇళ్లు, పొలాలు నీటమునిగాయి. రోడ్లు దెబ్బతిని రవాణా వ్యవస్థ స్తంభించింది.

మున్నేరు వరద తీవ్రత వరంగల్, మహబూబాద్‌లలో కురిసిన వర్షాల మీద ఆధారపడి ఉండగా.. దానికి తోడు ఖమ్మంలోనూ అదేస్థాయిలో వర్షపాతం నమోదైతే ఆ ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనా పడుతోంది. ఈ కారణంగా మున్నేరు వరద తీవ్రత ప్రాంతాలనుబట్టి ఒకటి రెండు అడుగుల తేడా అవకాశం ఉండగా, ఖమ్మంలో 36 అడుగుల మేర ప్రవహించిన మున్నేరు... ఏపీలోని కీసరలో మాత్రం 37.6 అడుగులు నమోదైనట్టు తెలుస్తోంది. 2005లో కీసరలో 35.66 అడుగులు నమోదు కాగా ఖమ్మంలో 32 అడుగులు, 2023లోనూ కీసర వద్ద 34.3 అడుగులు ఉండగా.. ఖమ్మంలో 31 అడుగులు, మేర మున్నేరు ప్రవహించింది. ఆదివారం రాత్రి నుంచి తగ్గుముఖం పట్టిన మున్నేరు మంగళవారం రాత్రికి ఆరు అడుగులకు తగ్గింది. బుధవారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో కురిసిన వర్షాలకుగాను మరో ఆరు అడుగులు పెరిగి 12.25 అడుగులమేర ప్రవాహం కొనసాగుతోంది.

మున్నేరు దెబ్బకు ఖమ్మం అతలాకుతలం

రెండు తెలుగురాష్ట్రాల రాకపోకలకు కేంద్రబిందువైన ఖమ్మం జిల్లా కేంద్రం మున్నేరు ఒక్కసారిగా వరద తీవ్రత పోటెత్తడంతో అతలాకుతలమైంది. నగరంలోని పదులకొద్దీ డివిజన్లు మున్నేటి వరదల్లో చిక్కుకుపోయాయి. ఒకటి రెండు డివిజన్లు మినహా మిగిలిన డివిజన్లన్నీ మోకాళ్ల లోతు నీళ్లతో నిండిపోయాయి. మహబూబాబాద్‌లో కురిసిన అత్యధికంగా వర్షాలు పడటంతో ఎగువనుంచి వచ్చిన వరద ఎగబాకింది. దాంతో మున్నేరు నదీతీరం పక్కన ఉన్న ప్రాంతాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు సైతం నీటితో నిండిపోయాయి. మున్నేరుకు మునపెన్నడూ లేనివిధంగా 36 అడుగుల మేరకు వరద ఉధృతి పెరగడంతో రవాణా వ్యవస్థ స్తంభించిపోయింది.

ఐఎంఏ అధ్యక్షుడిగా కంభంపాటి



అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి కంభంపాటి, జగదీష్, స్వప్న

ఖమ్మంకలెక్టరేట్, సెప్టెంబరు13: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డాక్టర్ కంభంపాటి నారాయణ రావు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం రాత్రి ఐఎంఏ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. నారాయణరావును అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. జనరల్ సెక్రెటరీగా డాక్టర్ కే.జగదీశ్‌బాబు, కోశాధికారిగా డాక్టర్ గుబ్బల స్వప్న ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ (ఐఎంఏ) అసోసియేషన్ సభ్యులు, పలువురు డాక్టర్లు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

భద్రాద్రిలో 4 నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయం

భద్రాచలం, సెప్టెంబరు 13: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అక్టోబరు 4 నుంచి 12 వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. అలాగే 12న విజయదశమి సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పట్టాభిషేకం, విజయోత్సవం, అయుధ పూజ, శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించనున్నారు. అలాగే అక్టోబరు 17న శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఆశ్వీజమాసంలో నిర్వహించే ఉత్సవాలకు సంబందించిన నివేదికను భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవికి వైదిక బృందం అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను దేవస్థానం అధికారులు పత్రికలకు విడుదల చేశారు.

తొమ్మిది రోజులు తొమ్మిది అలంకారాలు

తొమ్మిది రోజుల పాటు శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. 4న ఆదిలక్ష్మి అలంకారంలో, 5న సంతాన లక్ష్మి, 6న గజలక్ష్మి, 7న ధనలక్ష్మి, 8న ధాన్యలక్ష్మి, 9న విజయలక్ష్మి, 10న ఐశ్వర్య లక్ష్మి, 11న వీరలక్ష్మి, 12న మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమివ్వనున్నారు.

అలాగే దసరా ఉత్సవాల్లో భాగంగా 12వ తేదీన శ్రీ సీతారామచంద్రస్వామి వారికి పట్టాభిషేకం, విజయోత్సవం, ఆయుధ పూజ, శ్రీరామలీలా మహోత్సవం నిర్వహించనున్నారు. శరన్నవరాత్రిఉత్సవాల సందర్భంగా అక్టోబరు 4 నుంచి 12 వరకు తిరువీధి సేవలు, సంక్షేప రామాయణ హవనం నిర్వహిస్తారు.

17న శబరి స్మృతి యాత్ర

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆశ్వయుజ మాసంలో జరిగే ఉత్సవాల వివరాలను దేవస్థానం అధికారులు వెల్లడించారు. అక్టోబరు 4 నుంచి 12 వరకు విజయదశి సందర్భంగా లక్ష్మీతాయారు అమ్మవారు వివిధ అలంకారల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే శ్రీరామాయణపారాయం నిర్వహించనున్నారు. అలాగే 17న శబరిస్మృతి యాత్ర, వాల్మీకి జయన్తి 28న లక్ష కుంకుమార్చన 31న సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన ఆటోయూనియన్ నాయకుడు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు13: రాంగ్‌రూటులో వస్తూ ఓ ద్విచక్ర వాహనాన్ని ఖమ్మం నగరానికి చెందిన ఓ ఆటో యూనియన్ నాయకుడు ఆటోతో ఢీ కొట్టిన సంఘటన శుక్రవారం ఖమ్మం నగరలో జరిగింది. బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. నగరానికి చెందిన తిరగమళ్ల రమేష్‌బాబు అనే వ్యక్తి తన కూతురుతో ద్విచక్రవాహనంపై వెళుతున్నాడు. అదేసమయంలో కొత్తబస్టాండ్ వైపు నుంచి ఓ ఆటో యూనియన్ నాయకుడు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈప్రమాదంలో ఆటోడ్రైవర్ ఆయన అనుచరులతో కలిసి ద్విచక్రవాహనంపై ఉన్న రమేష్‌పై గొడవకు దిగాడు. దీంతో భయాందోళనకు గురై వారు డయల్100కు ఫోన్ చేశారు. దీంతో టుటౌన్ పోలీసులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని ఇరువురిని టుటౌన్ స్టేషన్‌కు తరలించారు. కాగా రమేష్‌కు తీవ్రగాయాలు కావడంతో పోలీసులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం బాధితుడు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అనుమతి లేని ఆసుప్రతిపై చర్యలు తీసుకోవాలి

» ఐఎంఏ ప్రతినిధులు ఫిర్యాదు



వైరా ఎస్సైకు ఫిర్యాదు చేస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

వైరా, సెప్టెంబరు13: వైరా రిజర్వాయర్ రోడ్డులో చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న ఆసుపత్రి వైద్యుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మం జిల్లా ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) జిల్లా కార్యవర్గ సభ్యులు శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వైద్యాడిగ్రీ అర్హత లేని కె. మోహన్‌రావు ప్రస్తుతం కేఎంఆర్ పేరుతో చట్టా విరుద్ధంగా నకిలీ ఆసుపత్రిని నిర్వహిస్తున్నారని ఆ ఫిర్యాదులో తెలిపారు. వైరా డాక్టర్స్ అసోసియేషన్ ఇటీవల ఖమ్మం డీఎంఅండ్ హెచ్‌ఓకు చేసిన ఫిర్యాదును కూడా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ప్రస్తవించారు. ఇప్పటికే మూడు నాలుగు సార్లు ఆసుపత్రి పేరు మార్చి అర్హత లేకపోయిన డాక్టర్‌గా చలామణి అవుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటం ఆడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు. చట్టవిరుద్ధంగా నిర్వహిస్తున్న హనోక్ ఆసుపత్రిపై కూడా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు నారాయణరావు, కార్యవర్గ సభ్యులు హరిప్రసాద్, కిషన్‌రావు, వైరా డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ డి.కోటయ్య, సభ్యులు కాపా మురళీకృష్ణ, టి.శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రావు, పెరుమాళ్ల కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజ్‌గోపాల్

ఖమ్మం లీగల్, సెప్టెంబరు13: రుణ వసూలుకు సంబంధించిన వివాదాలను పరిష్కరించుకోవటానికి బ్యాంకర్లు జాతీయ లోక్ అదాలత్ వేదికను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ రాజ్‌గోపాల్ అన్నారు. శుక్రవారం ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి గాను బ్యాంక్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

కొత్తగూడెం వైద్య కళాశాలలో 127 పోస్టుల భర్తీ

● ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమార్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు13: కొత్తగూడెం ప్రభుత్వ వైద్య కళాశాలలో 127 పోస్టులను కాంట్రాక్ట్, గౌరవ వేతనం ప్రతిపాదికన భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాజకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కేటగిరిలలో ఈ భర్తీని నిర్వహిస్తున్నట్లు వాటిలో ప్రొఫెసర్లు-9, అసోసియేట్ ప్రొఫెసర్లు-35, అసిస్టెంట్ ప్రొఫెసర్లు-14, ట్యూటర్లు-17, సీనియర్ రెసిడెంట్లు-57 ఉన్నాయని వివరాలు వెల్లడించారు. అర్హులైన వారు ఈ నెల 18వ తేదీన భద్రాద్రి జిల్లా ఐడీవోసీలో సమావేశ మందిరంలో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు సకాలంలో తమ ఒరిజినల్ విద్యార్హత ధ్రువ పత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు13: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు తెలిపారు. శుక్రవారం నగరంలోని శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డీఐఈవో 20మంది ప్రిన్సిపాల్స్‌తో అకాడమిక్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, నీట్, ఎఫ్‌సెట్, జెఈఈ పరీక్షలకు శిక్షణ అందించాలని తెలిపారు. స్టూడెంట్ కౌన్సిలర్స్‌ను ఏర్పాటుచేసి విద్యార్థుల్లో మానసిక పరిస్థితులను గమనించి సూచనలు అందించాలని సూచించారు. కళాశాలల్లో యువ టూరిజం క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో విజ్ఞానంను పెంపొందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పరిమళించిన సేవాభావం

» వరద బాధిత కుటుంబాలకు అండగా స్వచ్ఛంద సంస్థలు » పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చిన వ్యక్తులు

ఖమ్మం సాంస్కృతికం, సెప్టెంబరు 13: ఆపదలో చిక్కి అల్లాడుతున్న బాధితులను తమవంతుగా సాయపడేందుకు దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావడంతో సేవా భావం పరిమళించింది.. గత పది రోజులుగా మున్నేటి తీర ప్రాంతంలోని వీధులతో పాటు తదితర వరద ముంపు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు వెల్లువెత్తుతున్నాయి.. తోటి వారికి వీలైనంత తోడ్పాటు నివ్వడం ద్వారా మానవత్వం చాటుకునేందుకు ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు, ఉద్యోగులు ఎవరికి తోచిన విధంగా వారు దాతృత్వాన్ని ప్రదర్శించారు. ఖమ్మంలోని మున్నేటికి గతంలో ఎన్నడూ లేని విధంగా వరద ముప్పు ఏర్పడి పరివాహక ప్రాంతాల వారు నిరాశ్రయులు కావడంతో దాతలు మేము సైతం అంటూ ముందుకొచ్చారు. వరదల్లో సర్వం కోల్పోయి దిక్కుతోచని స్థితికి గురైన వారి కన్నీళ్ల తుడిచి కొద్దిపాటి ఆసరా కల్పించడం ద్వారా భరోసా నింపారు. ప్రతిరోజు వరద బాధిత ప్రాంతాలను సందర్శిస్తూ వారికి సేవా కార్యక్రమాలను అందించటంతోపాటు వారి సామాన్ల తరలింపు, వీధులు, ప్రాంతాలు, పరిసరాలను పరిశుభ్రం చేయటం, మంచినీరు, వైద్యం తదితర సేవలందించారు. నిత్యావసరాలను సరఫరా చేయడం, అన్నదానం, పులిహోర పొట్లాలను పంపిణీ, సహాయ చర్యలు చేపట్టారు. పలువురు దాతలు సీఎం సహాయ నిధి కోసం తమ వంతు ఆర్థిక సాయాన్ని జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

సహాయ సహకారాలు... ఇలా..

☛ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పీఎస్‌ఆర్ సంస్థ ద్వారా ఖమ్మం, పాలేరు, నియోజక వర్గాల్లో వరద బాధితులకు నిత్యావసర కిట్లను అందజేయడం ద్వారా బాధితుల్లో మనోధైర్యం నింపారు.

☛ ఎంపీ బండి పార్థసారథిరెడ్డి హెటిరో డ్రగ్స్, సిందు హాస్పటల్స్ తరఫున కోటి రూపాయలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు..

☛ మాజీమంత్రి తన్నీరు హరీష్ రావు ఖమ్మం మున్నేరు వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. తన నియోజక వర్గం నుంచి ఖమ్మంలోని వరద ప్రాంతాలకు నిత్యావసర కిట్లను అందజేసి మానవత్వం చాటుకున్నారు.

☛ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మున్నేటి ప్రాంతాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు నిత్యావసరాలను పంపిణీ చేసి అండగా నిలిచారు.

☛ తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు తరుపున ఆయన కుమారులు (ఎన్‌ఆర్‌ఐలు) తాళ్లూరి జయశేఖర్, తాళూరి రాజశేఖర్, జిల్లా ఎన్‌ఆర్‌ఐ ఫౌండేషన్ ద్వారా సహాయ కార్యక్రమాలు అందజేశారు.

☛ జీవీ మాల్ అధినేతలు వరద బాధితులను ఆదుకునేందుకు మేము సైతం అంటూ ముందుకొచ్చి రూ. 10 లక్షలు అందించారు

☛ ప్రముఖ వ్యాపారి కురువెళ్ల ప్రవీణ్ తమ సంస్థల తరుపున వరద బాధితుల కన్నీళ్లను తుడిచేందుకు రూ. 10 లక్షలు సాయం చేశారు.

☛ ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ. 20వేల సాయంతోపాటు బాధితులకు అన్నదానాలు చేశారు.

☛ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులకు కూరగాయలు, నిత్యావసరాలు పంపిణీ చేశారు

☛ హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు (హైసా) ఆధ్వర్యంలో వరద బాధితులకు 6వేల కిట్లను సరఫరా చేశారు

☛ వీవీసీఫౌండేషన్, ఇస్కాన్, సత్యసాయి, చేతన ఫౌండేషన్ల ద్వారా వరద బాధితులకు నిత్యావసరాలు, పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.

☛ దేవాదాయ, విత్తనాభివృద్ధి తదితర ఉద్యోగ సంఘాలు వరద బాధిత ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టి అన్నదానాలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు అందరూ తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందజేశారు.

☛ అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్ సింగ్ తన నెల వేతనాన్ని వరద బాధితులకు విరాళంగా ప్రకటించారు

☛ హెరిటేజ్ పాల సంస్థ వరద బాధిత ప్రాంతాల్లో పాల ప్యాకెట్లను ఉచితంగా అందించింది.

☛ ఎస్‌బీఐ,ఎల్ ఐసీ, సంస్థలు బాధితులకు దుప్పట్లను, టవల్స్‌ను అందించాయి.

☛ క్రెడాయ్ ఆధ్వర్యంలో వరద బాధితులకు ప్రతిరోజు అన్నదానాలు చేశారు.

☛ ఖమ్మం మహాజన సంఘం ఆధ్వర్యంలో మున్నేరు వరద బాధితులను ఆదుకునేందుకు విస్తృత చర్యలు చేపట్టారు. స్వర్ణభారతి కళ్యాణ మండపంలో తమ సంస్థ ఆధ్వర్యంలో వరద బాధితులకు సహాయ పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయడం తోపాటు 16 రకాల నిత్యావసరాలను కిట్లను అందించారు.

☛ వ్యక్తులు, ఇతర స్వచ్ఛంద సంస్థలు, సైతం వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతు సాయంగా ముందుకొచ్చాయి. పండ్లు, బ్రెడ్లు, పులిహోర ప్యాకెట్లు అందించారు.

☛ జిల్లా దేవాదాయ శాఖ చేపట్టిన ఆపన్నహస్తం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్నేటి తీరంలోని వరద బాధితులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు.. దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం. అనిల్ కుమార్, ఉద్యోగ, అర్చక సంఘం నాయకులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

☛ లయన్స్‌క్లబ్ ఖమ్మం ఆధ్వర్యంలో తుమ్మలగడ్డ ప్రాంతంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా నిత్యావసర వస్తువులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొల్లి కొండ శ్రీనివాసరావు, కార్యదర్శి గెల్లా శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

☛ బాలు చారిటబుల్ ట్రస్ట్‌ఆధ్వర్యంలో మంచికంటి నగర్‌లో వరద బాధితులకు అన్నదానం చేశారు.కార్యక్రమంలో ట్రస్ట్ బాధ్యులు కుక్కల ప్రవల్లిక, పి. వేణు, కె. సైదులు తదితరులు పాల్గొన్నారు.

☛ వరద బాధితులను ఆదుకునేందుకు టీజీఏఐడీసీ ఆగ్రోస్ సంస్థ ముందుకొచ్చింది. సంస్థ ఉద్యోగులు బొక్కలగడ్డలోని వరద బాధితులకు పాలు, పండ్లు, బియ్యం, నిత్యావసర వస్తువులతోపాటు సీఎం సహాయనిధికి లక్షా పదివేల అయిదు వందల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఆగ్రోస్ సంస్థ ఛైర్మన్ కాసుల బాలరాజు, ఆగ్రోస్ ఎండీ రాములు, మార్క్‌ఫెడ్ డీఎం సునీత, తదితరులు పాల్గొన్నారు.

☛ సీపీఎం అర్బన్ కమిటీ ఆధ్వర్యంలో అగ్రహారం కాలనీలోని వరద బాధితులకు నగర ప్రముఖులు కొల్లి వాణి, నామా పద్మ సౌజన్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా బాధితులకు చీరెలు, లుంగీలు, టవల్స్, తదితర దుస్తులు, నిత్యావసర వస్తువుల కిట్‌లను అందజేశారు.. కార్యక్రమంలో నాయకులు వై. విక్రమ్, ఎస్‌కే మీరా, ఎం ఏ జబ్బార్, తదితరులు పాల్గొన్నారు..



☛ గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు భోజనం, అల్పాహారం, దుప్పట్లు, చీరెలు, నిత్యావసర వస్తువులు అందించారు.

☛ కేవీపీఎస్ నాయకులు నందిపాటి మనోహర్, పాపిట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో కాల్వొడ్డు ప్రాంతంలోని జలగం నగర్, తదితర ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టారు.. బాధితులకు పాల ప్యాకెట్లను అందజేశారు.

☛ జిల్లా పెట్రోల్ డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరద బాధితులకు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర ప్రగడ రంగనాథ్, కార్యదర్శి కూరపాటి మంజుల, తదితరులు పాల్గొన్నారు.

☛ ఖమ్మంలోని శ్రీలక్ష్మీబాలాజీ సేవా సమితి ఆధ్వర్యంలో వరద బాధితులకు అన్నం ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ వడ్డే లక్ష్మి, వెంకటరమ, జ్యోతి, రేవతి, మనోహరి, రజిత, రాజేశ్వరి, లక్ష్మీవసంత తదితరులున్నారు.

☛ జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో వరద బాధితులకు చాపలు, దుప్పట్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాధిక్ అహ్మద్, ఫర్హానా, షమీమ్, ఆర్షియా, ఆసిఫా తదితరులు పాల్గొన్నారు.

☛ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జలగం నగర్, కరుణగిరి, తదితర ప్రాంతాల్లోని మున్నేటి వరద బాధితులకు బుధవారం సేవా కార్యక్రమాలను అందించారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి వినోద్ రావు, రుద్రప్రదీప్, బార్ అసోసియేషన్ నాయకులు నేరేళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

☛ సీపీఐ జిల్లా సమితిఆధ్వర్యంలో రామన్నపేట కాలనీలో బాధితులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు..కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జమ్ముల జితేందర్ రెడ్డి, పోటు కళావతి, తాటి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

☛ మాస్ లైన్ ఆధ్వర్యంలో బుధవారం వరద బాధితులకు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా మాస్ లైన్ నేత గోకినపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ, సహకారాలు అందించాలన్నారు.

మున్నేరు వరద

నేర్పిన పాఠాలు ఎన్నో..

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 13: ఖమ్మం నగరంలో ఈ నెల 1న సంభవించిన వరద విలయం ఎన్నో పాఠాలు నేర్పిందని ఉన్నతాధికారులు అంటున్నారు. బాధితులను ఆదుకోవడంలో, సహాయక చర్యలు చేపట్టడంలో దాదాపు వారం రోజుల పాటు వారు నిమగ్నమయ్యారు. ఊహించని విధంగా వరద పోటుకు ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చూడ గలిగారు. రోడ్డున పడిన బాధితులను ఆదుకోవడంలో చురుకైన పాత్ర పోషించారు. వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడటంలో, వారికి పునరావాసం కల్పించడంలో చర్యలు తీసుకున్నారు. మున్నేరు వరద తమకెన్నో అనుభవాలను, పాఠాలు నేర్పిందని అధికారులు చెబుతున్నారు.

ఆ రోజు నా జీవితంలో మర్చిపోలేను..



● అభిషేక్ అగస్త్య, కమిషనర్, కేఎంసీ

ఆరోజు(సెప్టెంబరు 1) నా జీవితంలో మర్చిపోలేను. ఉదయం నుంచి రాత్రి 3గంటల వరకు ప్రతి క్షణం ఒక అనుభవమే. ఊహించని వరద పోటు మున్నేరుకు వ్యాపించింది. కేవలం రెండు గంటల వ్యవధిలోనే పది అడుగుల వరద తీవ్రత ఉప్పెనగా వచ్చింది. ఆ సమయంలో గ్రామీణ ప్రాంతానికి పడవలు, డీఆర్‌ఎఫ్ బృందాలు వెళ్లాయి. మత్స్యశాఖ కార్యాలయానికి నేను వెళ్లి పడవలను తీసుకొచ్చాం. వాటిలో రెండు పనిచేయలేదు. మధ్యాహ్నం 3గంటలకు పడవలు అందుబాటులోకి వచ్చాయి. తర్వాత ఎన్డీఆర్‌ఎఫ్ బలగాలు వచ్చాయి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మేయర్ పునకొల్లు నీరజ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీసు కమిషనర్ సలహాలు పాటిస్తూ ముంపు ప్రాంతాల బాధితులను బయటకు తీసుకొచ్చాం.

రాత్రి 3గంటల వరకు పరివాహక ప్రంతంలోనే ఉన్నాం. మరుసటి రోజు కొంత వరద తీవ్రత తగ్గడంతో 5 పునరావాస కేంద్రాలకు బాధితులను తరలించాం. రెండో రోజు మున్నేరు తగ్గిన జల్లుతో కూడిన వర్షం రావడంతో కొంత ఇబ్బంది ఏర్పడింది. కానీ మూడో రోజు వరకు 80శాతం పారిశుధ్య పనులు చేశాం. విషయం తెలుసుకొని సీడీఎంఏ డైరెక్టర్ వీపీ గౌతమ్, వైద్యఆరోగ్యశాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఖమ్మానికి వచ్చి మాకు మంచి మార్గదర్శకం చేశారు. వరంగల్ నుంచి 300, నల్గొండ నుంచి 50 మంది కార్మికులు, 14 మండలాల నుంచి అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేశాం.

అందరి సహకారంతో ప్రజల్ని రక్షించాం..



● పునకొల్లు నీరజ, మేయర్, కేఎంసీ

అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు అందరి సహకారంతో మున్నేరు వరదలను ఎదుర్కొన్నాం. 40 అడుగల మేరకు వరద వస్తోందని ఎవ్వరూ ఊహించ లేదు. కమిషనర్ నుంచి పారిశుధ్య కార్మికుల వరకు కార్పొరేటర్లు సైతం నిర్విరామంగా పనిచేశారు. అందరి సహకారంతో మూడు రోజులకే వరద పట్టిన ప్రాంతాలను శుభ్రం చేయగలిగాం. వరంగల్, నల్గొండ, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్మికులు మంచి సేవల్ని అందించారు. నగర పాలక సంస్థలో అన్ని విభాగాల అధికారులు, ఉద్యోగులు రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుభవాలు మాకు ఎంతో ఉపకరించాయి.

సమష్టి నిర్ణయాలతో విపత్తును ఎదుర్కొన్నాం..



● సంపత్‌కుమార్, అసిస్టెంట్ కమిషనర్

గతంలో ఖమ్మం మున్నేరుకు గరిష్టంగా 32 అడుగుల వరకు రికార్డు నమోదు జరిగింది. ఇరిగేషన్ లెక్కల మేరకు ఇప్పుడు 40అడుగులకు పైగా నమోదు జరిగింది. కేవలం నిమిషాల వ్యవధిలోనే మున్నేరు పరివాహక ప్రాంతం మునిగిపోయింది. ఇంతటి విపత్తును ఊహించ లేదు. వరద పోటుతో ఇళ్లు, రహదారులు, ప్రాంతాలు బురదతో వ్యాపించాయి. వరద తర్వాత మరో రెండు రోజులు జల్లులతో కూడిన వర్షం రావడంతో బురద తొలగింపు పెద్ద కష్టంగా మారింది. మేయర్ పునకొల్లు నీరజ, సీడీఎండే డైరెక్టర్ వీపీ గౌతమ్, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ఎప్పటికప్పుడు వనరులు, యంత్రాలు, పారిశుధ్య కార్మికులను ఇతర జిల్లాల నుంచి తెప్పించి త్వరితగతిన పారిశుధ్య చర్యలను చేశాం. ముంపు తర్వాత మూడు రోజులకే 70శాతం పారిశుధ్య పనులు పూర్తి చేశాం. సిబ్బంది రాత్రింబవళ్లు కష్టపడి పనిచేశారు. అందుకే ప్రజల్ని అంటు వ్యాధుల నుంచి రక్షించగలిగామనే సంతృప్తి మిగిలింది..

20 మందిని రక్షించామనే తృప్తి మిగిలింది..



● రంజిత్‌కుమార్, ఎస్‌ఈ, కేఎంసీ

నేను గతంలో భద్రాచలం, మణుగూరు ప్రాంతంలో పని చేశా. గోదావరికి వరదలు వచ్చిన సమయంలో బాధితులను రక్షించేందుకు తాగునీటి పథకాలను కాపాడేందుకు బోట్ల ద్వారా వెళ్లి వారిని రక్షించాం. మున్నేరు వరదల్లో నాతో పాటుగా డీఈ నవీన్‌కుమార్, ఏఈ హుస్సేన్ రెస్క్యూ టీంలో పని చేసి 20మందికి పైగా వరదల నుంచి బోట్ల సహాయంతో బయటకు రప్పించాం. మున్నేరుకు వరద పోటు రావడంతో ప్రధానమైన తాగునీటి ఇన్‌టేక్‌వెల్ వ్యవస్థ మున్నేరు వరదలో కొట్టుకుపోయింది. ముఖ్యమైన ఫీడర్ లైన్, 15 పోల్స్ ట్రాన్స్‌ఫార్మర్ వరదలో కొట్టుకుపోయాయి. దీంతో నూతనంగా పల్లేగూడెం నుంచి ఇన్‌టేక్ వెల్ తీసుకొని నడిపిస్తున్నాం. ఖమ్మం నగరానికి 69ఎంఎల్‌టీ నీరు రోజు వారీగా అవసరం ఉంటుంది. వరదల కారణంగా 39ఎంఎల్‌టీ ధ్వంసమైంది. మరో వారం రోజుల్లో 69 ఎంఎల్‌టీ వాటర్ రన్నింగ్ చేసేందుకు కార్యాచరణ చేశాం. విద్యుత్‌శాఖ ఎస్‌ఈ సురేందర్ కూడా సహకరించారు.

జ్వరాన్ని కూడా తట్టుకొని పని చేశా...



● ఆర్. శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారి

మున్నేరుకు వరదలు వచ్చిన సమయానికి నాకు జ్వరం వచ్చింది. అయినా జ్వరాన్ని లెక్క చేయలేదు. మహిళా కాలేజీలో పునరావాస కేంద్రంలో బాధ్యతలను నాకు అప్పగించారు. బాధితులకు సౌకర్యాలు, భోజనాలు ఇతర సౌకర్యాలను ఇబ్బంది లేకుండా చేశాం. ఒక వైపు పునరావాస ఏర్పాట్లతో పాటుగా ఖమ్మం నగరంలో ముంపునకు గురైన 14 డివిజన్లలో రెవెన్యూ, కేఎంసీ బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి సర్వేను సమగ్రంగా వివాద రహితంగా చేపట్టాం. ముంపునకు గురైన ప్రాంతాల్లో 8 క్యాంపులు ఏర్పాటు చేసి ధ్రువపత్రాలు వరదలో పోయిన వారికి తిరిగి వాటిని అందించే కార్యక్రమం చేపట్టాం. ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు విజయానంద్, ఏ జ్యోతి, వజ్జా రామారావు, 25 మంది బిల్ కలెక్టర్లు, 6 జూనియర్ అసిస్టెంట్లు పలువురు అధికారులతో సమన్వయం చేసుకొని ముందుకెళ్లాం..

ఉపాధ్యాయుడు ప్రభు దయాళ్ సేవలు వెలకట్టలేనివి

» కలెక్టర్ జితేష్ వి పాటిల్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, సెప్టెంబరు13: సామాజిక సేవా కార్యక్రమాలలో భద్రాద్రి జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయుడు డాక్టర్ ప్రభు దయాళ్ సేవలు వెలకట్టలేనివని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ కొనియాడారు. శుక్రవారం ఐడీవోసీలో ఇటీవల ఉపాధ్యాయుల దినోత్సవ సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో వివిధ సేవా కార్యక్రమాల్లో చేసిన సేవలకు గాను ప్రత్యేక ఉత్తమ అవార్డును పొందిన ప్రభు దయాళ్‌ను అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పని చేస్తూ స్వచ్ఛంద వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అత్యుత్తమంగా ఉన్న ఐదుగురిని ఎంపిక చేయగా, అందులో భద్రాద్రి జిల్లాకు చెందిన ప్రభు దయాళ్ ఉండడం హర్షించదగ్గ విషయమని కలెక్టర్ అన్నారు. కొత్తగూడెం మునిసిపాలిటీలోని రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, నోడల్ అధికారిగా విధులు నిర్వహిస్తూ రాజీ పడకుండా విద్యాభివృద్ధి కోసం తనదైన శైలిలో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతీ ఒక్కరికి ఆదర్శంగా నిలిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.



ప్రభుదయాళ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం

● ఎస్పీ రోహిత్ రాజు

చుంచుపల్లి, సెప్టెంబరు13: మహిళల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని పాత పోలీస్ స్టేషన్‌లో జిల్లా షీ టీమ్, ఏహెచ్‌టీయూ (యాన్టీ హూమన్ ట్రాఫికింగ్ యూనిట్) కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా షీ టీమ్స్ నెంబర్ 8712682131కి ఫోన్ చేసి తమ సమస్యను తెలియజేసుకోవచ్చన్నారు. ఈ ఏడాది జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్‌లలో 47కు పైగా కేసులు, 47 పెట్టి కేసులు(రెడ్ యాండ్‌గా) 92 అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ పరితోష్‌పంకజ్, కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్పీ ఇన్‌స్పెక్టర్స్ నాగరాజు, శ్రీనివాస్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, టూటౌన్ సీఐ రమేష్, సైబర్ క్రైమ్స్ సీఐ జితేదర్, ఆర్ఐలు సుధాకర్, రవి, లాల్‌బాబు, కృష్ణారావు, షీ టీమ్స్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, ఆర్ఎస్ఐ రమాదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజు

గిరిజన బీఈడీ కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్

భద్రాచలం, సెప్టెంబరు 13: భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బీఈడీ కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్‌ను శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ మణెమ్మ ప్రారంభించారు. 2024-26 విద్యా సంవత్సరానికి గాను ఎంపికైన అభ్యర్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి అడ్మిషన్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీరునాయక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

● ఓఎస్‌డీ పరితోష్ పంకజ్

పాల్వంచ, సెప్టెంబరు 13 : క్వారీల్లో రికార్డుల నిర్వహణ సరిగా ఉండాలని, క్వారీకి వచ్చిన మెటీరియల్, వినియోగించిన మెటీరియల్, మిగిలిన వాటికి సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని క్వారీ యజమానులను కొత్తగూడెం ఓఎస్‌డీ పరితోష్ పంకజ్ హెచ్చరించారు. శుక్రవారం పాల్వంచ మండలం తోగ్గూడెంలోని ఏడు క్వారీలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఆయా క్వారీల్లోని స్టాక్ రిజిస్టర్‌లను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో వారితో కొత్తగూడెం ఓఎస్‌డీ కార్యాలయంలో ప్రత్యేకంగా సమావేశమై వారికి క్వారీల నిర్వహణ పద్ధతులను, నిర్వాహకులపై ఉన్న పాత కేసులను వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీ యజమాని, సూపర్‌వైజర్, ఆపరేటర్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం క్వారీల్లో బ్లాస్టింగ్ నిర్వహించే విషయంలో ఒకరోజు ముందుగానే పోలీసులకు సమాచారం అందజేయాలని సూచించారు. ప్రతి నెల క్వారీలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పాల్వంచ సీఐ వినయ్‌కుమార్, పాల్వంచ రూరల్ ఎస్ఐ సురేష్‌లను ఆదేశించారు.

గుంతలో పడి వృద్ధురాలి దుర్మరణం

తల్లాడ, సెప్టెంబరు 13: ఇంటి ఆవరణలోని మురికి గుంతలో పడి ఓ వృద్ధురాలు శుక్రవారం రాత్రి దుర్మరణం చెందిన సంఘటన మండలంలోని కలకొడిమ గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లమందల ముత్తమ్మ(70) అనే వృద్ధురాలు ఈ ఇంటి ఆవరణలో వరద నీరు నిలిచి ఉండటంతో ప్రమాదవశాత్తు జారిపడి పక్కన గల మురికి గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందింది.

మనస్తాపంతో విద్యార్థి బలవన్మరణం

ముదిగొండ, సెప్టెంబరు13: కాలేజీకి వెళ్లమని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపంతో ఓ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మండలంలోని రాఘవాపురం గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దేశబోయిన రాకేష్ (18) ఖమ్మంలోని ఓప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతున్నాడు. వినాయక చవితి సెలవుల సందర్భంగా విద్యార్థి ఇంటికి రాగా రెండురోజులుగా కళాశాలకు రమ్మని కళాశాల వారు ఫోన్ చేయడంతో, తల్లిదండ్రులు శుక్రవారం చదువును నిర్లక్ష్యం చేయవద్దని మందలించి సాయంత్రం హాస్టల్‌కు వెళ్లమని చెప్పి పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ముదిగొండ సీఐ మురళి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భద్రాద్రిలో వేడెక్కిన రాజకీయం

» బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల పరస్పర విమర్శలు

కౌశిక్‌రెడ్డిపై దాడి అప్రజాస్వామికం: రేగా

భద్రాచలం, సెప్టెంబరు 13: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి పలువురు ఎమ్మెల్యేలు చేరికపై హైకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో భద్రాద్రిలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు భద్రాచలంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాపాలన పేరుతో ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై చేస్తున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై కాంగ్రెస్ దాడి పూర్తిగా అప్రజాస్వామికమని, పిరికిపందల చర్యని దమ్మంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు రాజీనామా చేసి మాట్లాడాలని సవాల్ విసిరారు. మొన్న మాజీ మంత్రి హరీష్‌రావు ఇంటిపైన దాడి, ఖమ్మం వరద బాధితులను పరామర్శించేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నాయకులపై దాడి చేయడం, తాజాగా కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి చేయడం సిగ్గుమాలిన పని అని దీనికి కాం గ్రెస్ నాయకులు సిగ్గుపడాలన్నారు. కాంగ్రెస్ నాయకుల తీరుతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ తగ్గుతుందని విమర్శించారు. డాక్టర్ తెల్లం వెంకట్రావు పార్టీ మారి నియోజకవర్గ అభివృద్ధికి తెచ్చిన నిధులేమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.

తప్పుగా మాట్లాడితే ఉపేక్షించేది లేదు: కాంగ్రెస్

రేగా కాంతారావు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గురించి తప్పుగా మాట్లాడితే ఉపేక్షించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, అరికెల తిరుపతిరావులు అన్నారు. పినపాక నియోజకవర్గంలో కాంగ్రెస్ చేతిలో చిత్తు చిత్తుగా ఓడిపోయిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు భద్రాచలం ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు డాక్టర్ తెల్లంకు నియోజకవర్గ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నువ్వు నీ సీటు కూడా గెలవలేకపోయావని, బీఆర్‌ఎస్ టికెట్ అయినా సొంత ఇమేజ్‌తో డాక్టర్ తెల్లం భద్రాచలం నియోజకవర్గంలో విజయం సాధించారని ఆయనను విమర్శిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున గెలిచి బీఆర్‌ఎస్‌లో చేరిన మీరు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారా, మరి అలాంటప్పుడు భద్రాచలం ఎమ్మెల్యే గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదని వారు స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కరకట్ట పొడిగింపునకు రూ.40 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు, రామాలయం అభివృద్ధికి రూ.60 కోట్లు తీసుకొచ్చారని తెలిపారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

● ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపాడు, సెప్టెంబరు 13: వర్షాకాలం నడుస్తుందున ఆదివాసి గిరిజన గ్రామాలలో వైరల్ జ్వరాలు డెంగ్యూ మలేరియా వ్యాధులు ప్రబలుతున్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం బూర్గంపాడులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని డ్రగ్ స్టోర్, లాబరేటరీలను పరిశీలించి హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రోగులను వైద్య చికిత్సలపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న ఆదివాసి గిరిజన కుటుంబాలకు వైద్య సిబ్బంది, వైద్యాధికారులు తాము పని చేసే ఆరోగ్య కేంద్రాలలో స్థానికంగా ఉంటూ, 24గంటలు గిరిజనులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. అనంతరం విద్యార్థుల చేత సబ్జెక్టులకు సంబంధించిన అంశాలను పిల్లల చేత అడిగి తెలుసుకుని పిల్లలు గణితంలో సరైన సమాధానం చెప్పకపోవడంతో సంబంధింత ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ సెంటర్ పర్యవేక్షకుడు ముక్కంటేశ్వరరావు, డాక్టర్లు అనిత, సబితారెడ్డి, మౌనిక, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్

సాధారణ స్థితికి గోదావరి

భద్రాచలం, సెప్టెంబరు 13: భద్రాచలం వద్ద గోదావరి సాధారణ స్థితికి చేరుకుంటుంది. శుక్రవారం రాత్రి 7 గంటలకు 39.4 అడుగులకు చేరింది. గురువారం రాత్రి 10 గంటలకు 41.1 అడుగులున్న గోదావరి శుక్రవారం ఉదయం 6 గంటలకు 40.5 అడుగులకు తగ్గింది. అనంతరం 9 గంటలకు 40.3, 12 గంటలకు 40 అడుగులకు, సాయంత్రం 5 గంటలకు 39.5, రాత్రి ఏడు గంటలకు 39.4 అడుగులకు తగ్గింది. శనివారానికి మరింత తగ్గనుంది.

విద్యుదాఘాతంతో రైతు మృతి

తల్లాడ, సెప్టెంబరు 13: వరిపైరుకు నీరు రావడం లేదని వాగులోని విద్యుత్ మోటార్‌ను పరిశీలిస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం తల్లాడ మండలం రంగాపురం గ్రామంలో చోటుచేసుకుంది. రంగాపురం గ్రామానికి చెందిన రైతు యరమల వెంకటరెడ్డి(55) చెన్నూరు వాగు సమీపంలో వరి సాగుచేశాడు.

వాగు నుంచి విద్యుత్ మోటార్ ద్వారా వరిపైరుకు నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. నీళ్లు రాకపోవడంతో వాగులో ఉన్న విద్యుత్ మోటార్‌ను పరిశీలిస్తుండగా, విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వాగులో విగతజీవిగా పడి ఉన్న వెంకటరెడ్డిని ఇసుక కోసం వెళ్లిన వారు చూసి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వ సాయం

● జిల్లాలో 2,144మందికి రూ.3.53 కోట్ల పంపిణీ

కొత్తగూడెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో భారీ వర్షాల మూలంగా వచ్చిన వరదలకు ముంపుకు గురైన ప్రాంతాల్లో ఇళ్ల కొల్పోయి నష్టం జరిగిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేసింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా 2, 144మంది నష్టపోయిన నిరాశ్రయులకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 3. 53,76,000కోట్లు పంపిణీ చేసింది. జిల్లాలో అత్యధికంగా మణుగూరు ప్రాంతంలో 1817మంది వరద బాధితులుగా గుర్తించారు. అశ్వాపురం ప్రాంతంలో 202మంది వరద బాధితులుగా గుర్తించారు. వీరికి ఒక్కొక్క ఇంటికి రూ. 16,500చొప్పున ఆర్థిక సహాయాన్ని అందచేసినట్లు కలెక్టరేట్ కార్యాలయం ప్రకటించింది.

పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత

» కీలక సబెక్టులకు పోస్టులు ఖాళీ » ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు » నాలుగు మండలాలకు ఒక్కరే ఎంఈవో

కరకగూడెం, సెప్టెంబరు 13: ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని.. విద్య బోధనలో ముందంజలో ఉన్నాయని.. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్న మాటలు ఆచారణలో సాధ్యం కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలో సరిపడ తరగతులకు ఉపాధ్యాయులను అధికారులు నియమించక పోవడంతో విద్యార్థుల చదువులు సాగడం లేదు. ఇటీవల ప్రభుత్వం గతంలో పనిచేస్తున్న ఉపాధ్యాయలను బదిలీలు చేసింది. కానీ బదిలీల స్థానంలో పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియమించలేదు. మండల వ్యాప్తంగా 43 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 25 ప్రాథమిక పాఠశాలలు, 13 గిరిజన ప్రాథమిక పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ పాఠశాల, ఒక ఆశ్రమ పాఠశాల, మూడు జిల్లా పరిషత్ పాఠశాలలు ఉన్నాయి. 43 పాఠశాలలకు సుమారు 75 మంది ఉపాధ్యాయులు ఉండాలని కానీ ఇందులో సుమారు 45 మంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.



అరకొర వసతులతో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు

కీలకమైన సబ్జెక్టులకు ఉపాధ్యాయులు కరువు..

మండలంలోని కరకగూడెం, భట్టుపల్లి, అనంతారం, ఉన్నత పాఠశాలలో తెలుగు, సోషల్, హిందీ, పీఈటీ, మ్యాథ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతేకాక కరకగూడెం ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా ఒక్కరు లేక పోవడంతో సీఆర్‌పీనే బోధిస్తున్నారు. పాఠశాలలు ప్రారంభం అయి మూడు నెలలు గడుస్తున్నాయి.

ఇప్పటికైన ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులు కోరుతున్నారు.

నాలుగు మండలాలకు ఒక్కరే ఎంఈవో బాధ్యతలు

కరకగూడెం, పినపాక, మణుగూరు, అశ్వాపురం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు ఒక్కరే ఎంఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాంతో మండలంలోని పలు పాఠశాలలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని పలువురు విద్యార్థుల తల్లి దండ్రులు వాపోతున్నారు. కొందరు ఉపాధ్యాయులు ఇల్లెందు, కొత్తగూడెం, భద్రాచలం, కొత్తగూడెం, బంజరా, పాల్వంచ, మణుగూరు నుంచి ఇక్కడకు రాక పోకలు సాగిస్తున్నారు. కొందరు సమయానికి రావడం లేదు.. సమయం వరకు ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. పూర్తి స్థాయి ఉపాధ్యాయులను, ఎంఈవోను నియమించాలని పలువురు కోరుతున్నారు.

పూర్తి స్థాయి ఉపాధ్యాయులను నియమిస్తాం
వీరస్వామి, ఇన్‌చార్జ్ ఎంఈవో

ప్రభుత్వం బదిలీలలో బాగంగా ఖాళీ ఉన్న స్థానంలో కొందరిని నియమించాము. ఎవరు జాయిన్ అయ్యారో, ఎవరు కాలేదో అనే విషయం ఉన్నత స్థాయి అధికారులకు పంపించాము. త్వరలోనే ఉన్నత అధికారులు ఆదేశాలతో ఉపాధ్యాయులను ఏర్పాటు చేస్తాం.

ఇప్పటికైనా అలుగు నిర్మాణం చేపట్టేనా?

» వెంగళరావు సాగర్ ప్రాజెక్టు అలుగుకు గండి పడి ఐదేళ్లు
» గత పాలకులు పట్టించుకోలేదని రైతుల ఆవేదన
» ఎమ్మెల్యేగా గెలిస్తే అలుగు నిర్మాణం పూర్తి చేస్తానని జారే ఆదినారాయణ హామీ





గతంలో అలుగుకు గండిపడిన దృశ్యం(ఫైల్) ఈ సీజనులో అలుగు కింది భాగంలో కోతకు గురైయిన భూమి

చండ్రుగొండ, మార్చి 13: మూడు వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తూ ఏడు గ్రామాలకు చెందిన రైతులకు జీవనాధారంగా ఉన్న వెంగళరావు సాగర్ ప్రాజెక్టును పాలకులు పట్టించుకోకపోవటం పట్ల రైతులు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండలంలోని సీతాయిగూడెం, దామరచర్ల గ్రామాల మధ్య ఉన్న ఈ ప్రాజెక్టు ద్వారా సీతాయిగూడెం, దామరచర్ల, అయిన్నపాలెం, ఇమ్మడిరామయ్య బంజర్, మహ్మద్‌నగర్, తిప్పనపల్లి, చండ్రుగొండ గ్రామాల పరిధిలో మూడు వేలు ఎకరాలకు ఖరీఫ్‌లో వరి సాగుకు నీరు అందుతుండుగా, మరో వేయి ఎకరాకు వేసవిలో వరి సాగు అవుతుంది. దీంతో పాటు వంద కుటుంబాలు చేపల వేటాడుతూ జీవనం సాగిస్తున్నారు. ప్రాజెక్టువల్ల ఈప్రాంతంలో భూగర్భ జలాలు అధికంగానే ఉంటున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఏడు గ్రామాల రైతులు ఈ ప్రాజెక్టుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇంత ప్రాధాన్యం కలిగిన నీటి ప్రాజెక్టుకు ఉన్న 335 మీటర్ల పొడవాటి అలుగుకు ఐదు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల భారీగా గండ్లు పడ్డాయి. దీంతో వచ్చిన నీరు వచ్చినట్లు కిందికి పోతుంది. వరద వల్ల ఆలుగు కింది భాగంలో భారీగా భూమి కోతకు గురవుతుంది. ప్రాజెక్టులో నీరు తగినంతగా నిలవక పోవటంతో ఆయకట్టుకు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బంది ఎర్కొంటున్నారు. ప్రాజెక్టు దుస్థితిని గత పాలకుల దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో ఎమ్మెల్యేగా గెలిస్తే అలుగు నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇచ్చి పూర్తి చేస్తానని జారే ఆదినారాయణ రైతులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే జారే ఇచ్చిన హామీని రైతులు గుర్తుచేస్తూ హామీని నిలుపుకోవాలని రైతులు కోరుతున్నారు.

జీవనోపాధిని కోల్పోయాము
లక్ష్మయ్య, మత్స్య సొసైటీ చైర్మన్



ప్రాజెక్టులో తగినంత నీరులేకపోవటంతో చేపల వేట సాగటం లేదని దీంతో చేపల వేటపై జీవిస్తున్న దాదా పు వంద కుటంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అలుగుకు గండ్లు పడటం వల్ల నీటితో పాటు చేపలు సైతం బయటకు పోతున్నాయని, దీనివల్ల సంవత్సరం పాటు సాగాల్సిన వేట రెండు, మూడు నెలలుకూడ జరగటం లేదు.

ప్రతిపాదనలో కాలం గడిపిన గత పాలకులు
కేశవులు, రైతు, సీతాయిగూడెం



అత్యంత నీటివరులు ఉన్న ప్రాజెక్టు అలుగుకు గండ్లు పడ్డ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యేతో పాటు ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి తక్షణమే అలుగు పునర్నిర్మాణం చేపట్టాలని కోరాం. అప్పటి నుంచి ప్రాతిపాదనలు పంపుతున్నామని నీటి పారుదల అధికారులు చెబుతున్నారని, అదే సమయంలో గత ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు సైతం ప్రతిపాదనల ఫైలు సీఎం కేసీఆర్ పరిశీలనలో ఉందని చెప్పేవారని, ప్రస్తుత పాలకులైనా నిధులు విడుదల చేయించాలని సీతాయిగూడెం గ్రామనికి చెందిన రైతు, మాజీ ఉపసర్పంచ్ బొర్రా కేశవులు తెలిపారు. రూ.16 కోట్ల నుంచి పలు దపాలు ప్రతిపాదనలు మారుతూ ప్రస్తుతం దాదాపు రూ.33 కోట్లకు చేరిందనా, నిధులయితే మంజూరు కావటం లేదు.

నరసాపురంలో హిందీ దినోత్సవం

దుమ్ముగూడెం సెప్టెంబరు 13:నరసాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో శుక్రవారం హిందీ దినోత్సవాన్ని జరుపుకున్నారు. హిందీ భాష పట్ల అవగాహన, భాషా నైపుణ్యం కలిగి ఉండాలని హెచ్ఎం శ్రీనివాసరావు, హిందీ టీచర్ డానాంపల్లి మధుసూదనరావు అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందించారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

దమ్మపేట, సెప్టెంబరు 13: దమ్మపేటకు చెందిన సిద్ధేశ్వరరావు ఇటీవలే తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆపరేషన్ చేసేందుకు అంత ఆర్థిక స్థోమత లేక పోవటంతో పేదకుటుంబానికి వైద్యం అందించేందుకు దమ్మపేట-మండలపల్లి చౌదరి వేల్ఫేర్ అసోసియోషన్ ఆద్వర్యంలో ఆకుటుంబ సభ్యులకు రూ. 5వేలు ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గడ్డిపాటి సత్యం, అధ్యక్షులు పోతినేని శ్రీరామవెంకట్రావు, కార్యదర్శి పెనికపాటి కృష్ణయ్య, యలమర్తి కిషోర్ కుమార్, పారుపల్లి వీరభద్రం, గొల్లపల్లి మోహన్‌రావు అందజేసిన వారిలో వున్నారు.

ముగిసిన పాఠశాల స్థాయి క్రీడా పోటీలు

జూలూరుపాడు, సెప్టెంబరు 13: జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి పాఠశాలల క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిసాయి. రెండో రోజు బాలికలకు అండర్-14, అండర్-17 విభాగలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడా కారులను జోనల్ స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేశారు. అనంతరం క్రీడల మండల కన్వీనర్ లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోటీలలో గెలుపొందిన జట్లకు తహసీల్దార్ స్వాతిబింధు, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు పెండ్యాల ప్రసాదరావు బహుమతులను అందజేశారు. పోటీల నిర్వహణకు, క్రీడా కారులకు భోజన వసతి, షీల్డ్‌లను ఇచ్చిన దాత ప్రసాదరావు, మరో ఇద్దరు దాతలను తహసీల్దార్ సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎస్‌కె మీరా, సంజీవరావు, ఆర్య వైశ్య సంఘం నాయకులు వి. గురునాథం అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

పాల్వంచ టౌన్, సెప్టెంబర్ 13: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. సాంబ ఆధ్వర్యంలో జరిగింది. నూతన కమిటీ అధ్యక్షురాలిగా కే. సింధు (కొత్తగూడెం), ప్రధాన కార్యదర్శిగా జే. గణేష్ (ఇల్లెందు), కోశాధికారిగా నవీన్ (పాల్వంచ), కార్యవర్గ సభ్యులుగా వివేక్, పవన్, కే. ప్రశాంతి (ఇల్లెందు), నాగబాబు (పాల్వంచ), భరత్ (టేకులపల్లి) నియమితులయ్యారు.

అనారోగ్యంతో సబ్ స్టేషన్ ఆపరేటర్ మృతి

కరకగూడెం, సెప్టెంబర్ 13: మండల కేంద్రంలోని విద్యుత్ ఉప కేంద్రంలో ఆపరేటర్ గా పనిచేసే ఈసంపల్లి నాగయ్య (51) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పినపాక మండలం ఏడూళ్లబయ్యారం గ్రామానికి చెందిన నాగయ్య గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యంతో ఇబ్బందులు పడుతూ చికిత్స చేయించుకుంటున్నాడు. హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు., మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి: డీఈ

కరకగూడెం, సెప్టెంబర్ 13: పాఠశాలలోని విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మైనింగ్ డీఈ, మండల ప్రత్యేక అధికారి ధినేష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విద్యార్థుల భోజనాలను పరిశీలించారు. ఎస్వో శ్రీదేవిని ఉపాధ్యాయుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడినుంచో పాఠశాలపై నమ్మకంతో చదువు కోవడానికి వచ్చిన విద్యార్థులకు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కుమార్, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

నేటితరం వైద్యులకు విజేందర్‌రావు ఆదర్శం: కూనంనేని



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం, సెప్టెంబర్ 13 (ఆంధ్రజ్యోతి): నేటితరం వైద్యులకు డాక్టర్ విజేందర్‌రావు ఆదర్శమని, ధనార్జనకు కాకుండ వైద్య, వృత్తిని ప్రజాసేవగా మలుచుకున్న మహోన్నత వ్యక్తి అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాలులో శుక్రవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంతాప, సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కొత్తగూడెం పట్టణంలో వైద్యశాలను ప్రారంభించి పట్టణ ప్రజలకే కాకుండ మారుమూల ఏజెన్సీ ప్రజ.లకు వైద్యసేవలు అందించి ప్రజా వైద్యుడిగా పేరు తెచ్చుకున్నారనని కొనియాడారు. ప్రజాసేవకు అంకితమై పని చేసే వారు అరుదుగా ఉంటారని అలాంటి వారిలో విజేందర్‌రావు ప్రముఖుడని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు వైద్యులు, పట్టణ ప్రముఖులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, పలువురు వైద్యులు, ప్రముఖులు మద్దెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే భూపతిరావుకు ఎమ్మెల్యే తెల్లం నివాళి



నివాళ్లర్పిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి

భద్రాచలం, సెప్టెంబరు 13: పాలేరు మాజీ ఎమ్మెల్యే భూపతిరావు వర్ధంతి సందర్భంగా భద్రాచలం మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు నివాళ్లర్పించారు. శుక్రవారం భద్రాచలంలోని భూపతిరావు కాలనీలోని భూపతిరావు ఇంటికి వెళ్లి భూపతిరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో భూపతిరావు కుటుంబ సభ్యులు, భీమపాక శాంతమ్మ, హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేష్, భీమపాక నంబూద్రి, భీమపాక విద్యాసాగర్, డాక్టర్ ఆర్.నారాయణ, సీనియర్ న్యాయవాది ఎంవి రమణారావు, విద్యాసాగర్‌రావు, గొడపర్తి నాగరాజు, రావి రామ్మోహన్, పడిసిరి శ్రీనివాసరావు, ఎస్‌కె అజీమ్, దుద్దుకూరి హరినాథ్ పాల్గొన్నారు.

కార్మికవర్గ పక్షపాతి ఏచూరి

» సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వీఎస్ రావు, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి , డీసీసీబీ మాజీ చైర్మన్ రవికుమార్



మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ రవికుమార్

కొత్తగూడెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీపీఎం అఖిల భారత కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం వల్ల దేశం ఒక కమ్యూనిస్టు యోదుడ్ని కోల్పోయిందని భారత కార్మిక ఉద్యమానికి ఏచూరి మరణం తీరని లోటని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వీఎస్.రావు, జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారిలు అన్నారు. శుక్రవారం బస్టాండ్‌సెంటరులో ఏచూరి సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏచూరి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా చేసే ప్రయత్నం చేస్తున్న బీజేపీ విధానాలపై సమరశంఖం ఊదాలని కార్మిక పోరాటాలను పదును ఎక్కించాలని పిలుపునిచ్చిన మహోన్నత వ్యక్తి నాయకుడు కామ్రేడ్ ఏచూరి అని అన్నారు. వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, వి. జాకబ్, వైఎన్. రావు, ఎన్ఎస్. రాజు, బత్తుల నాగేశ్వరరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

●పాల్వంచ టౌన్: ఏచూరి మరణం దేశానికి తీరని నష్టమని, వామపక్ష ఉద్యమాలకు గొడ్డలిపెట్టని సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు ఏజే. రమేష్ అన్నారు. పాల్వంచ పట్టణ కమిటి ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సీతారాం ఏచూరి సంతాపసభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి దొడ్డ రవికుమార్, ఎం. అప్పారావు, చిటికెన ముసలయ్య, పట్టణ కమిటీ సభ్యులు కే. సత్య, నిరంజన్, తులసీరాం, రహీం, కాంతి, రాములు, నజార్, వెంకట్రావ్, ఉపేష్, వెంకటయ్య, బ్రహ్మాజీ, నారాయణ, గట్టయ్య, సోమలింగం, రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.

●దుమ్ముగూడెం: సీపీఎం జాతీయ కార్యదర్శి ఏచూరి సీతారాం మృతిపట్ల మండల సీపీఎం శుక్రవారం ఘన నివాళులర్పించింది. జిల్లా సీనియర్ నాయకులు, డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్ ఆయన చిత్రపటానికి పూల మాల వేశారు. ఏచూరి మరణం సీపీఎంకే కాకుండా జాతీయ రాజకీయాలకు తీరని లోటని తెలిపారు. జిల్లా నాయకులు వంశీకృష్ణ, పుల్లయ్య, చంద్రయ్య, కోటేశ్వరావు, చిలకమ్మ, శ్రీను బాబు, ఎండీ బేగ్, సమ్మక్క, సాయిరెడ్డి, రాంమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

●ఇల్లెందు టౌన్ : పేద ప్రజల ఆశాజ్యోతిగా సీతారాం ఏచూరి పని చేశారని సీపీఎం జిల్లా నాయకులు అబ్దుల్ నబీ పేర్కొన్నారు. శుక్రవారం ఇల్లెందులో కూలీల అడ్డా, సుందరయ్యనగర్‌లో సీతారాం ఏచూరి సంతాపసభలను నిర్వహించారు. ఈ సంతాప సభల్లో సీపీఎం నాయకులు తాళ్లూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, ఆలేటి కిరణ్, మహ్మద్, భద్రు, సత్యనారాయణ, ఎండీ. అబ్బాస్, జైమున్నీసా తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయటం వల్లే రాష్ట్రపతి పురస్కారం



ఏఎన్ఎం సుశీలను సన్మానిస్తున్న దృశ్యం.

చండ్రుగొండ, సెప్టెంబరు 13: ఏ స్థాయిలో పనిచేసినా నిబద్ధతతో పని చేస్తే గుర్తింపు, గౌరవం లభిస్తుందని, అందుకు నిదర్శనం రాష్ట్రపతి నుంచి పురస్కారం అందుక్న మద్దుకూరు ఏఎన్ఎం తేజావత్ సుశీల నేనని ఎంపీడీవో అశోక్ అన్నారు. దీర్ఘకాలం మద్దుకూరు ఏఎన్ఎంగా విధులు నిర్వహించి, అక్కడి ప్రజల మన్ననలను పొందిన సుశీల బదిలీ అయ్యారు. గ్రామస్థులు, తోటి ఉద్యోగులు సుశీలను మద్దుకూరులో ఘనంగా సన్మానించారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిచారని వక్తలు కొనియాడారు.

నిమజ్జనానికి సహకరించాలి: మునిసిపల్ చైర్మన్

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 13: గణేష్ నిమజ్జనానికి అన్ని వర్గాలు సహకరించాలని ఇల్లెందు మున్సిపాలిటీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణలు కోరారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 17న గణేష్ నిమజ్జనం మున్సిపాల్టీ పరిధిలోని సత్యనారాయణపురం చెరువులో చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముందుగా అనుకొన్నట్టుగా ఆటినంబర్ చెరువులో నిమజ్జనం ఏర్పాట్లను అనివార్య కారణాల వల్ల చేయడంలేదన్నారు. సమావేశంలో మునిసిపల్ కమిషనర్ యాదగిరి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు డానియల్, మడుగు సాంబమూర్తి, జాఫర్, గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 13: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. మండలంలోని గుమ్మడివల్లి గ్రామంలోని పెదవాగు నుంచి రెండు ట్రాక్టర్లలో ఇసుకను అశ్వారావుపేటకు తరలిస్తున్నారు. మండలంలోని ఊట్లపల్లి సమీపంలోని ఫారెస్ట్ రేంజర్ మురళీ తన సిబ్బందితో తనిఖీలు చేయగా ఎటువంటి పత్రాలు లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. రెండు ట్రాక్టర్లను అటవీశాఖ కార్యాలయానికి తరలించి డ్రైవర్లు పుల్లయ్య, రాకేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడుల్లో ఫారెస్టర్ సంపత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిమజ్జనంలో రికార్డింగ్ డ్యాన్స్: ముగ్గురిపై కేసు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 13: మండలంలోని గుమ్మడివల్లిలో గురువారం రాత్రి వినాయకుడి నిమజ్జన కార్యక్రమంలో నిర్వాహకులు రికార్డింగ్ డ్యాన్స్‌ను ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాలకు చెందిన దాదాపు ఎనిమిది మంది యువతులను తీసుకువచ్చి ఊరేగింపులోనే యువతుల చేత నృత్యాలు చేయించారు. నిమజ్జనం అనంతరం గ్రామంలో ప్రత్యేకంగా స్టేజీని ఏర్పాటు చేసి యువతుల చేత నృత్యాలు చేయించారు. పెద్ద పెద్ద డీజే సౌండ్‌తో నిర్వాహకులు రికార్డింగ్ డ్యాన్స్‌ను నిర్వహించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివరామకృష్ణ గ్రామానికి వెళ్లి నృత్యాలు ఆపించారు. రికార్డింగ్ డ్యాన్స్‌ను ఏర్పాటు చేసిన వల్లెపు రాంబాబు, వెంకన్నబాబు, డీజే సిస్టం యజమానితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా ఎటువంటి డ్యాన్స్‌లు నిర్వహించినా, నిబంధనలు అతిక్రమించినా కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి అప్రజాస్వామికం: వనమా



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా

చుంచుపల్లి/ఇల్లెందు, సెప్టెంబరు 13: బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేయడం అప్రజా స్వామిక చర్యలకు నిదర్శనమని, ఇలాంటి దాడులను సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి వనమ వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం బీఆర్ఎస్ కొత్తగూడెం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సంఘటన అత్యంత దారుణమని ప్రజాస్వామ్య వాదులంతా ముక్త కంఠంతో ఖండించాల్సిందిగా పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసేలా ప్రయత్నించడం తగదన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధించడంలో కీలక పాత్ర వహించిన ఎమ్మెల్యే హరీష్‌రావును, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిలను, తదితర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అక్రమంగా అరెస్ట్ చేసి గంటల తరబడి నిర్బంధించి ఇబ్బందులకు గురి చేశారని మండి పడ్డారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కేసీఆర్ ఇలాంటి వాటిని ఎప్పుడు ప్రోత్సహించలేదని గుర్తు చేశారు. ప్రజా స్వామ్యబద్ధంగా పోరాడి తెలంగాణ సాధించిన వ్యక్తి కేసీఆర్ అని స్పష్టం చేశారు. దాడులకు పాల్పడిన ఎమ్మెల్యే గాంధీతో పాటు ఆయన అనుచరులపై హత్యాయత్న కేసును నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మీ, వైస్ చైర్మన్ దామోదర్, కౌన్సిలర్లు రుక్మందర్ బండారి, వేముల ప్రసాద్, అంబుల వేణు, సుజాత, బిఆర్ఎస్ నాయకులు బత్తుల వీరయ్య, అన్వర్ పాషా, కొట్టి వెంకటేశ్వర్లు, భూక్యా సోనా, కనకేష్, రాజుగౌడ్, కూసన వీరభద్రం, జక్కుల సుందర్, కొల్లు పద్మ, సత్యం పాల్గొన్నారు.

తెలంగాణలో సీమాంధ్ర పాలన

ఇల్లెందు: బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిపై దాడి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అరెస్ట్ అమానుషమని ఉమ్మడి జిల్లా బీఆర్ఎస్ వ్యవస్థాపక నాయకుడు సిలివేరి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఇల్లెందులో కొత్త బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం జరిపారు. మాట్లాడుతూ తాను ఏ పార్టీ ఎమ్మెల్యేను అని కూడా ధైర్యంగా చెప్పుకోలేని వ్యక్తి కాంగ్రెస్ పార్టీ వంత పాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేపై దాడి చేయడం నీతిలేని చర్యని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులు తెచ్చిన తెలంగాణ రాజ్యంలో సీమాంధ్ర నేతల పెత్తనాన్ని సహించబోమని అన్నారు. కార్యక్రమంలో ఇల్లెందు పట్టణ ప్రధాన కార్యదర్శి పరుచూరి వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ మాజీ ఛైర్మన్ బావ్ సింగ్, కౌన్సిలర్లు జేకే శ్రీను, తోట లలిత, శారద, ఇల్లెందు పట్టణ మహిళా అధ్యక్షురాలు నెమలి ధనలక్ష్మి, కొక్కు సరిత తదితరులు ఉన్నారు.

గణపతి మండపాల్లో ప్రముఖుల పూజలు

భద్రాచలం, సెప్టెంబరు 13: భద్రాచలం ఐటీడీఏ ఉద్యోగుల కాలనీలో ఏర్పాటు చేసిన గణపతినవరాత్రి ఉత్సవాల మండపం వద్ద శుక్రవారం పీవో బి.రాహుల్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే భక్తులకు భోజనాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏడీ భాస్కర్, ఏటీడీవో అశోక్, జేడీఎం హరికృష్ణ, ఈఈ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

గణేష్ అన్నదానంలో న్యాయాధికారి

ఇల్లెందు టౌన్: గణేష్ నవరాత్రుల సందర్భంగా ఇల్లెందు పట్టణంలోని నెహ్రూనగర్ ఏరియాలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మిగణపతి మండపాన్ని శుక్రవారం ఇల్లెందు కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికా రెడ్డి దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. పూజలకు వచ్చిన జడ్జిని ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అన్నదాన కార్యక్రమాన్ని జడ్జి ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భూక్య రవికుమార్, ప్రధాన కార్యదర్శి కాంపెల్లి ఉమామహేశ్వరరావు, కౌన్సిలర్ తారా, ఉత్సవకమిటీ అధ్యక్షురాలు కటకం వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి భూక్య కోటేశ్వరరావు, కీర్తి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాయం ప్రత్యేక పూజలు

పినపాక: మండల పరిధిలోని సీతంపేట, ఈబయ్యారం గ్రామాల్లో మహాగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా శుక్రవారం పాల్గొన్నారు. గణపతును దర్శించుకుని ప్రత్యేక పూజల్ని నిర్వహించారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు కందిసుబ్బారెడ్డి, గంగిరెడ్డి వెంకటరెడ్డి, ఆరె నలిన్‌కుమార్, బండారు సాంబశివరావు, నవ్వతి శ్రీను, వర్తక సంఘం సభ్యులు సంతోష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

గణపతి పూజల్లో మాజీ ఎమ్మెల్యే మెచ్చా

దమ్మపేట: దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత వైభవంగా జరుగుతున్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. నాయుడుపేట ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.